ong-5_ong-5.qxd 9/7/2026 11:16 PM Page 1



## పోలీస్ స్పోర్ట్స్‌లో ప్రకాశం పోలీసుల సత్తా

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన తొలి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీల్లో ప్రకాశం జిల్లా పోలీస్ సిబ్బంది సత్తా చాటారు. గుంటూరు రేంజ్ తరఫున వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొన్న జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం 42 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పతక విజేతలను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా పోలీసులు 13 బంగారు, 16 వెండి, 13 కాంస్య పతకాలు సాధించినట్లు ఎస్పీ తెలిపారు. లాన్ టెన్నిస్ డబుల్స్, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు, కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్మ్ రెజ్లింగ్, పెన్కాక్ సిలాట్, ఫెన్సింగ్, 4 100 మీటర్ల రిలే, వుషు, తైక్వాండో, కరాటే, పవర్ లిఫ్టింగ్, హ్యాండ్‌బాల్‌తో పాటు కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగాల్లో పోలీస్ సిబ్బంది ప్రతిభ కనబరిచారు. ఈ విజయాలతో ప్రకాశం జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు. పోలీస్ విధులతో పాటు క్రీడలకు సమయం కేటాయించి క్రమశిక్షణతో సాధన చేయడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని పతకాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖకు పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చిన విజేతలను అభినందించారు. ఇదే పట్టుదలతో భవిష్యత్ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

## ప్రజా ఫిర్యాదులకు త్వరిత పరిష్కారం చూపాలి: ఎస్పీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలో ప్రజా సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ˝మీకోసం˝ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై మొత్తం 100 ఫిర్యాదులను అందజేశారు. జిల్లా ఎస్పీతో పాటు పోలీస్ అధికారులు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను పూర్తిగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాధితులకు భరోసా కల్పించారు. అనంతరం ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఎస్పీ మాట్లాడి మీకోసం కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హాజరత్తయ్య, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, వీవీపాలెం ఎస్సై ప్రేమ్‌కుమార్, ప్యానెల్ అడ్వొకేట్ బి. బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాస్మిన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకులాల్లో పచ్చదనం పెంచేందుకు అనంత అరణ్య మోడల్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో పచ్చదనం పెంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అనంత అరణ్య మోడల్ పేరుతో హైడెన్సిటీ ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టింది. జీవ మనుగడకు ప్రమాదకరంగా మారుతున్న కార్బన్ శాతాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 1,049 విద్యాసంస్థలను ఈ కార్యక్రమం అమలుకు ఎంపిక చేయగా, అందులో ప్రకాశం జిల్లా నుంచి 34, మార్కాపురం జిల్లా నుంచి 41 విద్యాసంస్థలు ఉన్నాయి. భూ విస్తీర్ణం, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అనంతరం తొలిదశలో ప్రకాశం జిల్లాలో 12, మార్కాపురం జిల్లాలో 10 విద్యాసంస్థల్లో అనంత అరణ్య మోడల్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సింగరాయకొండలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదివారం మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలను నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. పాఠశాలలు, గురుకులాల ప్రాంగణాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను సద్వినియోగం చేసుకుని విస్తృతంగా మొక్కలు పెంచనున్నారు. దీనివల్ల విద్యాసంస్థల పరిసరాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయనున్నారు.

## మహానటి భానుమతికి బ్రాహ్మణ సేవా సమితి నివాళి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



భారతీయ చలనచిత్ర చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహానటి డాక్టర్ భానుమతి రామకృష్ణ జయంతి సందర్భంగా ఒంగోలులో బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు బైపాస్ రోడ్డులో కిమ్స్ హాస్పిటల్ ఎదురుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆవిష్కరించిన డాక్టర్ భానుమతి రామకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సమితి జాయింట్ సెక్రటరీ ఆదిపూడి గిరిజ శాండిల్య మాట్లాడుతూ భానుమతి రామకృష్ణ కేవలం సినీ నటిగా మాత్రమే కాకుండా గాయనిగా, రచయిత్రిగా, సంగీత కళాకారిణిగా, దర్శకురాలిగా, నిర్మాతగా పలు రంగాల్లో తన ప్రతిభను చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. భానుమతి విగ్రహాన్ని ఒంగోలు నగరపాలక సంస్థ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయడం స్థానిక ప్రజలతో పాటు కళాభిమానులకు గర్వకారణమన్నారు. భానుమతి జీవిత చరిత్రను, కళా సేవలను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు సివిల్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు మద్దులూరి హరి ప్రేమ్‌నాథ్, జాయింట్ సెక్రటరీ ఆదిపూడి గిరిజ శాండిల్య, కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావు, సభ్యులు మైనంపాటి సాయికుమార్, ముక్తినూతలపాటి శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి ఆంజనేయులు తదితరులు, వారి మిత్రబృందం పాల్గొన్నారు. మహానటి భానుమతి రామకృష్ణ కళా సేవలు చిరస్మరణీయమని, ఆమె కీర్తి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు.

## కొత్త పెన్షన్ల దరఖాస్తులకు మార్గదర్శకాలు జారీ అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకోండి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన వారు తమ పరిధిలోని స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డులో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులతో ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత పెన్షన్ కేటగిరీకి అవసరమైన అదనపు ధ్రువపత్రాలను సమర్పించాలి. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత మహిళా సంక్షేమ సహాయకులు, వార్డు సంక్షేమ మరియు అభివృద్ధి కార్యదర్శులు వ్యక్తిగతంగా పరిశీలించి, అర్హులైన వారి వివరాలను అంతర్జాలంలో నమోదు చేస్తారు. అర్హత లేని దరఖాస్తుదారులకు కారణాలతో కూడిన ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నారు. అర్హత కలిగిన ప్రతి దరఖాస్తుదారుడికి నిబంధనల ప్రకారం పెన్షన్ మంజూరు చేసేలా చర్యలు చేపట్టనున్నారు. వృద్ధాప్య పెన్షన్‌కు 60 సంవత్సరాలు పైబడిన వారు, వితంతు పెన్షన్‌కు భర్తను కోల్పోయిన మహిళలు, ఒంటరి మహిళ, చేనేత, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్ నిబంధనలు వర్తిస్తాయి. అర్హత ఉన్న ఏ లబ్ధిదారుడూ నష్టపోకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా పెన్షన్ మంజూరు ప్రక్రియ చేపట్టాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అధికారులను ఆదేశించారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

**సంతనూతలపాడు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**



ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్ విజయ్‌కుమార్ కార్యాలయంలో 2,83,042 లక్షల రూపాయలు విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బిల్లా చెన్నయ్య కుటుంబానికి సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, అలియాస్ పి.ఎస్.ఆర్ జనసేన పార్టీ నాయకులు పల్లపోతు సాయిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా పరిషత్‌కు తెర..

*- సెప్టెంబర్ 24తో ముగియనున్న పాలకవర్గ పదవీ కాలం*

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఇప్పటి వరకు 56జడ్పీటీసీలతో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ ఇక 27జడ్పీటీసీలకు పరిమితం కానుంది. జిల్లాల పునర్విభజన జరిగేటప్పటికి జిల్లా పరిషత్ పాలకవర్గం ఉంది. అందుకని జడ్పీని ఉమ్మడిగా ఉంచారు. ఈ ఉమ్మడి పాలకవర్గం పదవి కాలం సెప్టెంబర్24తో ముగియనున్నది. ఆ తరువాత కొత్తగా మార్కాపురం, బాపట్ల జిల్లా పరిషత్ కార్యాలయాలు ఆవిర్భవించనున్నాయి. అందుకని ఈ సారి కొత్త జిల్లాల ప్రాతిపదికన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 56జడ్పీటీసీలు, 784 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మార్కాపురం జిల్లా 284 ఎంపీటీసీ స్థానాలకు పరిమితం కానుంది. ప్రకాశం జిల్లాకు 27జడ్పీటీసీలు, మార్కాపురం జిల్లాకు 21 జడ్పీటీసీలు ఏర్పాటు కానున్నాయి. అలాగే ఉమ్మడి జిల్లాలోని 8 మండలాలు బాపట్ల జిల్లా పరిషత్‌లోకి కలవనున్నాయి. 50ఏళ్ల చరిత్ర ఉన్న ప్రకాశం జడ్పీ ఇక కనుమరుగు కానుంది. గతంలో సమితిల వ్యవస్థతో కూడిన ఉమ్మడి జిల్లా జడ్పీ, మండల వ్యవస్థ ఏర్పాటు అనంతరం 56మండలాలతో కొనసాగుతూ వచ్చింది. 2021లో జడ్పీ ఎన్నికలు జరిగినప్పుడు 56మండలాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలోనే ఉండగా అవన్నీ కలిపి ప్రస్తుతం పాలకవర్గం ఏర్పడింది. అనంతరం ఉమ్మడి జిల్లా తొలుత 2022లో ఒక సారి గత ఏడాది డిసెంబర్‌లో మరోసారి పునర్‌వ్యవస్థీకరణ జరిగినా జడ్పీ మాత్రం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికపైనే కొనసాగుతూ వస్తుంది. ఈనెల 24తో జడ్పీ పాలకవర్గాలు ఒక రోజు ముందు 23తో మండల పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తుంది. దీంతో ఈసారి ఎన్నికలను కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసి ఆ ప్రకారమే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు వీలుగా నూతన జడ్పీల ఏర్పాటుపై గత శనివారం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చింది. జడ్పీ విభజన అయ్యే వరకు ఉమ్మడి ప్రకాశం జడ్పీ కార్యాలయం నుంచి ఎన్నికల కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్వోలు, ఈఆర్వోలు వంటి అధికారుల జాబితాను సిద్ధం చేయగా కలెక్టర్ ఫైనల్ చేయాల్సి ఉంది. విభజన తరువాత కూడా కొత్త జడ్పీల సిబ్బంది కుదుట పడే వరకు ఒంగోలు నుంచే పాలన సాగనుంది. 2022లో జిల్లాలో విభజన జరిగిన ఇప్పటికి కొన్ని శాఖల కార్యకలాపాలు ఒంగోలు నుంచి సాగుతున్నాయి. జిల్లాతో పాటు జడ్పీలు కొత్తగా ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి ఎన్నిక కావడంతో పాత రిజర్వేషన్లు పరిగణలోకి తీసుకోకుండా కొత్తగా ఖరారు చేయనున్నారు. అంటే గతంలో పలాన జడ్పీటీసీ స్థానానికి బీసీ రిజర్వు అయింది. ఈ సారి ఓసీ వస్తుందనుకునే పరిస్థితి లేదు. ఇదే సూత్రం చైర్మన్‌లకు వర్తిస్తుంది. దీంతో మూడు జిల్లాలకు జడ్పీ చైర్మన్ రిజర్వేషన్‌లపై అధికార కూటమి, వైసీపీలో ఉత్కంఠ నెలకొంది.




## మీకోసం అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి: కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కార వేదిక˝మీకోసం˝ ద్వారా స్వీకరించే ప్రతి అర్జీకి అత్యున్నత ప్రాధాన్యమిచ్చి, సకాలంలో నాణ్యమైన పరిష్కారం అందించాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో నిర్వహించిన ˝మీకోసం˝ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డీఆర్వో పి. వెంకటరమణ, ఎస్‌డీసీ మాధురి, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 246 అర్జీలు నమోదయ్యాయి. ప్రజల నుంచి వచ్చే వినతులపై అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా నమోదైన అర్జీలతో పాటు కలెక్టరేట్‌లో నేరుగా అందజేసినవి, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చినవి, మండల స్థాయి వినతులు, పల్లె నిద్ర వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో స్వీకరించిన అర్జీలను కూడా ప్రత్యేకంగా పరిగణించాలని తెలిపారు. ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలన చేసి, సమస్యకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీ నమోదైన వెంటనే జిల్లా కార్యాలయం నుంచి అర్జీదారులకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయడంతో పాటు, సమస్య పరిష్కారంపై స్పష్టమైన భరోసా కల్పించాలని సూచించారు. అర్జీదారులకు తమ సమస్య ఏ స్థాయిలో ఉందో ఎప్పటికప్పుడు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫోన్ కాల్స్ సర్వేలో ప్రజల నుంచి అత్యుత్తమ సానుకూల స్పందన వచ్చేలా అధికారులు చురుగ్గా పనిచేయాలని తెలిపారు. ద్వారా ప్రతికూల స్పందన వచ్చిన అర్జీలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా, పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

*- ఎస్పీ హర్షవర్ధన్ రాజు*

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



వినాయక చవితి ఉత్సవాలను శాంతి యుతంగా, నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతా వరణంలో నిర్వహించాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పోలీస్‌అధికారు లను, ఉత్సవ నిర్వా హకులను కోరారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. గణేష్ మండపాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ భద్రతా జాగ్రత్తలు తీసుకుని, పోలీస్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం, గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన వివిధ శాఖల అనుమతులను సులభంగా పొందేందుకు ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ తెలిపారు. ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనుమతికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింట్ తీసుకుని మండపంలో ఉంచాలని సూచించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే అనుమతించిన శబ్ద పరిమితుల్లో వినియోగించాలని తెలిపారు. ఊరేగింపులో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నృత్యాలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు, అధిక శబ్దం చేసే డీజేలు, ఇతర వాయిద్యాలను వినియోగించరాదని తెలిపారు. నిమజ్జన ఊరేగింపులో అనుమతించిన సమయం, మార్గం, నిమజ్జన ప్రదేశానికి సంబంధించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ సంప్రదించాలని సూచించారు.

## టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో దామచర్ల జనార్దన్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



మంగళగిరిలోని రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని నాయకులు చర్చించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండటం వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరంపై నాయకులు చర్చించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడం, ప్రజలతో సంబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే విధానంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, ఎదురవుతున్న సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం, నాయకులు సమష్టిగా పనిచేయడం వంటి అంశాలపైనా చర్చించినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడేలా ప్రజల్లో విస్తృతంగా పనిచేయాలని నాయకులు సూచించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీ పరిస్థితి, నియోజకవర్గాల వారీగా రాజకీయ పరిణామాలపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకునేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో స్థానిక నాయకత్వం కీలకంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించినట్లు సమాచారం. ఈ కాంక్లేవ్‌లో రాష్ట్ర టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎర్రమట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారుల కొరడా..

*- వార్త కథనాలపై స్పందించిన మైనింగ్ అధికారులు*

*- అక్రమ దారులపై రూ 19.47 లక్షల జరిమానా*

*- శానంపూడిలో 34.1 వేలటన్నుల అక్రమ తవ్వకాలు*

*- అక్రమ దారులకు నోటీసులు జారీ చేసిన మైనింగ్ అధికారులు*

**సింగరాయకొండ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**



అనుమతులు లేకుండా ఎర్ర మట్టి తవ్వి తరలించి సొమ్ము చేసుకున్న అక్రమ దారులపై ప్రకాశం జిల్లా మైనింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. వివరాల్లోకెళ్తే సింగరాయకొండ మండల పరిధిలోని శానంపూడి, పాత సింగరాయకొండ ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాల ఆనవాళ్లను గుర్తించారు. ఇందులో కొన్ని చోట్ల మట్టి దిబ్బలు, మిగిలిన మామిడి చెట్ల వేళ్ళు కనిపించేలా దర్శనమిచ్చాయి. విద్యుత్ స్తంభాలు చుట్టూ గతంలో తవ్వకాలు జరిగినట్లు సూచిస్తున్నాయి.అలాగే ప్రభుత్వ, సాగు భూముల్లో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి తరలించినట్లు అధికారులు పరిశీలించామని తెలిపారు.గతంలో అందిన సమాచారంతో వార్త కథనాలు పై స్పందించిన మైనింగ్ అధికారులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన మైనింగ్ అధికారులు కొన్ని వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినా అక్రమ దారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అనంతరం అధికారులు చేపట్టిన కొలతల్లో కొన్ని ప్రాంతాల్లో ఆరు మీటర్ల వరకు గ్రావెల్ తవ్వారని, మొత్తం సుమారు 34.1 వేల టన్నుల గ్రావెల్ తరలించినట్లు అంచనా వేసి రూ.19.47 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ముగ్గురు ఎర్ర మట్టి బకాసురులకు తొలుత నోటీసులుతో భారీ జరిమానా విధించి, అనంతరం డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు మైనింగ్ అధికారులు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో నిబంధనల ప్రకారం తహసీల్దార్‌కు ముందుగా నోటీసులు అందించి తదుపరి చర్యలు చేపడతామని అన్నారు. ఆ చర్యలపై స్పందించిన పక్షాన ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, నిబంధనల మేరకు ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు అధికారులకు అందిన సమాచారం మేరకే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నట్లు మైనింగ్ అధికా రులు వెల్లడించారు . అయితే అధికారుల దృష్టికి రాని ప్రాంతాల్లో మరెంత మేర తవ్వకాలు జరిగాయన్నది క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ ఎర్ర మట్టితో కోటి రూపాయలు గడిస్తున్న అక్రమ దారులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పెదారికట్ల వద్ద కారు దగ్ధం..

## - ప్రాణాలతో బయటపడ్డ శామ్యేల్ కుటుంబ సభ్యులు

**కొనకనమిట్ల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
మండల పరిధిలోని పెదారికట్ల సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కారు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లాయిపాలెం గ్రామానికి చెందిన రాచపూడి శామ్యేలు కుటుంబ సభ్యులు కారులో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి 565 పై పెదారికట్ల వద్దకు రాగానే కారులో హఠాత్తుగా మంటలు చెలరేగి





దగ్ధమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న కనిగిరి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీసి కేసు నమోదు చేశారు.

# సీనియర్ జర్నలిస్ట్ కొండయ్యకు కాసు ట్రస్ట్ సాయం

**కొనకనమిట్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
కొనకనమిట్ల మండల సీనియర్ జర్నలిస్ట్(వార్త) పీవి కొండయ్య ఇటీవల కామెర్ల వ్యాధికి గురై ఒంగోలు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గాలి బ్లాడర్ శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న కాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ (యుఎస్ఎ) కాసు వెంకటేశ్వర్ రెడ్డి రూ.10వేలు ఆర్థిక సహాయం పంపించి వితరణ చాటుకున్నారు. అమెరికా నుంచి కొండయ్య ఆరోగ్య పరిస్థితి గురించి అమెరికా నుంచి ఫోన్లో మాట్లాడారు. త్వరగా కోలుకొని పాత్రికేయ వృత్తిని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. వైద్య ఖర్చులకోసం ఆర్థిక సాయం అందించిన కాసు వెంకటేశ్వర్‌రెడ్డికి కొండయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల అభ్యసన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి

**లింగసముద్రం సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
జిల్లా అకడమిక్ మానిటరింగ్ పరిశీలకులు, ప్రభుత్వ డిఐఈటి మైనంపాడు సీనియర్ లెక్చరర్ పి.విజయకృష్ణ,ఎంఈఓ-1 కె.మాల్యాద్రితో కలిసి సోమవారం లింగసముద్రం మండలంలోని మోడల్ ప్రైమరీ స్కూల్, పెద్దపవని పాఠశాలను సందర్శించి విద్యా ప్రమాణాలు, బోధనా ప్రక్రియ, రికార్డులు, రిజిస్టర్లను, ఎండిఎం



పరిశీలించారు. పాఠశాలలో రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదని, వాటిని క్రమబద్ధంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. 3నుంచి 5వ తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు బాగున్నప్పటికీ, 1, 2వ తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయిలు చాలా తక్కువగా ఉన్నాయని గుర్తించారు. మిడ్ డే మిల్స్ రుచి, శుభ్రత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అభ్యసన ఫలితాలు, అనుభవాత్మక అభ్యసనం, ఎఫ్ఎల్ఎన్ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, జాదూయి పిటారాను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. లింగసముద్రం మండలంలో ఇకపై క్రమం తప్పకుండా అకడమిక్ మానిటరింగ్ సందర్శనలు ఉంటాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యచరణతో పనిచేయాలని సూచించారు.

# నూతన పెన్షన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

**వెలిగండ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్ సోమవారం తెలిపారు. జిల్లా అధికారులు, శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలు, సూచనల మేరకు ఈనెల 7నుండి 16వ తేదీ వరకు పెన్షన్ల మంజూరు కోసందరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అన్ని కేటగిరీలవారు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మీ పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని సందర్శించి పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో అర్హత ఉన్నవారు వినియోగించుకోవాలన్నారు. పెన్షన్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## - వైసీపీ ఇంచార్జ్ దద్దాల

**వెలిగండ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కనిగిరి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు సోమవారం వెలిగండ్ల మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. అనంతరం దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం



చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, కష్టకాలంలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరి సేవలను ఎప్పటికీ మరువలేమని తెలిపారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ,బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా పార్టీని మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్త ఒక కుటుంబ సభ్యుడిగా భావిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని దద్దాల నారాయణ యాదవ్ కోరారు. రాబోయే రోజుల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజల పక్షాన బలమైన గొంతుకగా నిలవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ పార్టీ ఉపాధ్యక్షుడు జడ్పిటిసి సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి, మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్లుపోలా సుబ్రహ్మణ్యం, కాకర్ల వెంకటేశ్వర్లు, వైయస్సార్ పార్టీ ముఖ్య నాయకులు ఏలిక నారాయణ, మారం వెంకటేశ్వర రెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, ఆవుల తిరుపతిరెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, పెరుగు తిరుపాల్ యాదవ్, గంజి రవీంద్రారెడ్డి, దాదా సోమయ్య, సూరబోయిన గురు ప్రసాద్, తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేపై పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

**పర్చూరు, సెప్టెంబర్7 ప్రభాతవార్త**
కారంచేడు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ మాధవీలత ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సర్వేకు సంబంధించి రెండు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ మాధవీలత తెలిపారు. ప్రజలు తమ భూ సమస్యలను నేరుగా



అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు రెవెన్యూ క్లినిక్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. అందిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్ సేవలను మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మాధవీలత కోరారు.

## హోమియో శిబిరానికి విశేష స్పందన

**పర్చూరు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
కారంచేడు ఎమ్మార్వో కార్యాలయం వద్ద సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఎక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ స్వర్ణ, ప్రభుత్వ హోమియో వైద్యుడు డాక్టర్ దాసరి ప్రదీప్‌కుమార్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని తగిన వైద్య సూచనలు



అందించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో పలువురు ప్రజలు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతిలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# తాగునీరు వదలాలని వినతి

**చీరాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
సోమవారం చీరాల నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆదేశాల ప్రకారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కి ఇవ్వడం జరిగింది. తోటవారిపాలెం పంపింగ్ స్కీం ద్వారా కాలవలన్నింటికీ త్రాగునీరు వదలవలసిందిగా కోరిరారు. కావూరివారి



పాలెం గవినివారిపాలెం పిట్టవారిపాలెం తోడవారిపాలెం పంచాయతీ లలో త్రాగునీరుకు బాగా ఇబ్బంది పడుతున్నారు. బోర్లన్నీ అడుగంటి పశువులు గొర్రెలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. కిష్టకాలవకు త్రాగునీరు వదిలినారు తోటవారి పాలెం పంపింగ్ స్కీంకు ఎందుకు వదలలేదు దీనికి అధికారుల నిర్లక్ష్యం కారణము కనీసం ఐదు రోజులపాటు త్రాగునీరు వదల్సిందిగా కలెక్టర్‌ని కోరినాము వారు వెంటనే అధికారులు పిలిచి మాట్లాడినారు అధికారులు త్రాగునీరు వదులుతామని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో చీరాల వైఎస్ఆర్ రైతు విభాగ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి గారు దేవ సహాయం గారు రైతులు పాల్గొన్నారు

## తెలుగుదేశం పార్టీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఎంఎం కొండయ్య

**చీరాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అత్యున్నత స్థాయి 'లీడర్ షిప్ కాంక్లేవ్' సమావేశంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. పార్టీ బలోపేతం,ప్రజా సంక్షేమ పథకాల అమలు మరియు భవిష్యత్ కార్యాచరణపై నాయకత్వంతో కలిసి చర్చించినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.



## వినాయక చవితి అనుమతుల ప్రక్రియను సులభతరం చేయాలి

### - బీజేపీ జనతా వారధి ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం

**చీరాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
చీరాల డివిజన్‌లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసి, ఉత్సవ కమిటీలకు అనవసర ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జనతా వారధి ఆధ్వర్యంలో చీరాల ఆర్డీవోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మువ్వల వెంకటరమణారావు, తడవర్తి చంద్ర



మరియు డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకున్న ఉత్సవ కమిటీలకు 48 గంటల్లోగా అనుమతులు మంజూరు చేసేలా, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ తదితర శాఖల అనుమతులను సింగిల్ విండో విధానంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్ ఐడీ అనుమతి నిరాకరణకు స్పష్టమైన లిఖితపూర్వక కారణాలు, జిల్లా వ్యాప్తంగా ఏకరీతి మార్గదర్శకాలు, అనధికారిక వసూళ్ల నివారణ, ఊరేగింపు-నిమజ్జనానికి ముందస్తు ప్రణాళిక, ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా భద్రత, ట్రాఫిక్, అగ్నిమాపక, విద్యుత్, శబ్ద కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా అధికారులు సహకరించాలని బీజేపీ జనతా వారధి కోరింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు , మువ్వల వెంకట రమణా రావు డా. తాడివలస దేవరాజు, కాకర్ల శ్రీ వెంకటేశ్వరరావు , క్షత్రియ సుహాసిని, సయ్యద్ షబీరా, తెల్లాకుల అయ్యప్ప, తడవర్తి చంద్ర , గోలి మల్లికార్జున రావు , కాకుమాను సుబ్బారావు, లక్కాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు

# ఎరుకల మహిళను అసభ్యపదజాలంతో

## దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**చీరాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
చీరాలటూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదినారాయణపురంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్ సందర్భంగా, ఇళ్లలో పాచిపని చేసుకొని జీవిస్తున్న సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వృద్ధురాలు మత్రా జాలమ్మపై చీరాల టూ టౌన్ సీఐ శశికుమార్ దురుసుగా,



అసభ్యకరమైన పదజాలంతో దూషించి, దాడి చేయడానికి ప్రయత్నించడాన్ని ప్రజాసంఘాల నాయకులు ఖండించారు. ఈ ఘటనతో వృద్ధురాలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఒక 70 ఏళ్ల వృద్ధురాలితో పోలీస్ అధికారి ఈ విధంగా వ్యవహరించడం అత్యంత ఆందోళనకరమైనది . చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు అధికారులు ప్రజలకు రక్షణగా నిలవాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని, ముఖ్యంగా వృద్ధులు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల పట్ల మరింత సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనపై చీరాల ప్రజాసంఘాల నాయకులు బాధితురాలు మత్రా జాలమ్మను పరామర్శించి, ఆమెకు ధైర్యం చెప్పడంతో పాటు, ఆమెకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఈ ఘటనపై బాపట్ల జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత పోలీసు అధికారిపై తగిన శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. పోలీసులు చట్టానికి అతీతులు కారుప్రజలను రక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో పనిచేసే ఏ అధికారి అయినా చట్టానికి అతీతుడు కాదని ప్రజాసంఘాల నాయకులు స్పష్టం చేశారు. బాధిత వృద్ధురాలి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. చీరాల టూ టౌన్ సీఐపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ చేపట్టి, బాధితురాలికి న్యాయం చేయాలని వారు బాపట్ల జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కోరారు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే చీరాలలోని అన్ని ప్రజాసంఘాలను ఐక్యం చేసి,ప్రజాస్వామ్య పద్ధతిలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని ప్రజాసంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నల్లబోతుల మోహన్ కుమార్ ధర్మా, బలహీన వర్గాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శవనం శామ్యూల్, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు, బీసీ ఫెడరేషన్ నాయకులు ఉటుకూరి వెంకటేశ్వర్లుఎంఆర్‌పీఎస్ నాయకులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, దుడ్డు వందనం వైహెచ్‌పీఎస్ నాయకులు మొగిలి ప్రతాప్‌కే ఉమాదేవి, మొగిలి శబరి, బాలిక బ్రహ్మయ్య, పాలపర్తి పోలయ్య, ఆంబోతుల ప్రవీణ్ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరిస్తాం

**తాళ్లూరు, సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
ప్రజలనుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఈడి,మండల ప్రత్యేకాధికారి ఫైజుద్దీన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ప్రజా



సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 33అర్జీలను స్వీకరించారు. నూతన పెన్షన్ కోసం 25,హౌసింగ్ 3,రెవిన్యూ 5వినతులు అందచేశారు. వీటిని శాశ్వత పరిష్కారాలు చూపాలని ఆయావిభాగాల అధిపతులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కి వచ్చే వినతులను బాధ్యతగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కారం చూపాలని అన్నారు. కార్యక్రమం లో ఎంపీడీఓ పి.అజిత,డిప్యూటీ తహసీల్దార్ జీ.ఫణీంద్ర,ఏపీఓ కె.వెంకటేశ్వర్లు, కార్యాలయం ఏవోగోపాలకృష్ణ,డిప్యూటీ ఎంపీడీవో వెంకటాద్రి,ఏపీఎం దేవరాజు, ఎంఈఓ సుబ్బయ్య,ఏఈలు హనుమంతరావు,వాలి,పశువైద్యాధికారిప్రతాపరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**తాళ్లూరు , సెప్టెంబరు 7, ప్రభాతవార్త**
కొత్తగా పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు సోమవారం నుంచి ఈ నెల 16వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పి. అజిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు విధిగా రసీదు పొందాలని కోరారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు.

## డీజేలకునో.. గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరిసీఐ వై. శ్రీహరి

### - ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

### - శాంతి భద్రతలకు విఘతాం కలిపిస్తే చర్యలు

### - ప్రజలు పోలీస్‌కు సహకరించాలి

**సింగరాయకొండ, సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
వినాయక చవితి నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్స్ కు పూర్తిగా అనుమతి లేదని సీఐ శ్రీహరి తెలిపారు. ఎస్పి ఆదేశాలు మేరకు సోమవారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాలు, ఊరేగింపులకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనుమతుల కోసం



వినాయక ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే సింగల్ విండోతో అనుమతులు పొందవచ్చునన్నారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. గణేష్ మండపాలు వద్ద ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అనుమతి తో పాటు మైకుల వినియోగానికి వీసీ అనుమతి కూడా తీసుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని చెప్పారు. ఊరేగింపుల్లో సాధారణ మైకులు,సౌండ్ సిస్టమ్స్ వినియోగించు కోవచ్చని, అధిక శబ్దాలు చేసే డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అల్లర్లు సృష్టించడం, నిబంధనలకు విరుద్ధంగా లౌడ్‌స్పీకర్లు వినియోగించడం, రికార్డు డ్యాన్స్ నిర్వహించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ట్రాఫిక్ నియంత్రణకు రూట్‌మ్యాప్‌లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసుల సూచనల మేరకు నిర్దేశిత మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎస్సైలు సుధీర్‌కుమార్, భాగ్యరాజు పాల్గొన్నారు.

## తౌశిక్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం

### - బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్

**సింగరాయకొండ, సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
తౌశిక్ మృతికి కారణమైన దోషులపై వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని, లేకుంటే న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. సోమవారం కనుమల్ల పరిధిలోని ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రాంతంలో తౌశిక్ తల్లి మోలాభి, కుటుంబ సభ్యులు ఆయనను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ



సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ చైతన్య నవోదయ కేంద్రంలో కనిగిరికి చెందిన ఆరో తరగతి మైనార్టీ విద్యార్థి తౌశిక్ అనుమానాస్పదంగా మృతి చెంది హత్యకు గురైతే,ఈ ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. ఆరు నెలలుగా న్యాయం కోసం పోరాడుతున్న తల్లికి న్యాయం చేయకపోగా విద్యాశాఖ అధికారులు, పోలీసులు బెదిరించడం దారుణమన్నారు. ఈ ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని విమర్శించారు. దోషులను గుర్తించి చర్యలు తీసుకోకుండా వారికి రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని హాస్టల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో బాధ్యులపై చర్యలు తీసుకుని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని తౌశిక్ కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# నేటి నుంచి కొత్త పెన్షన్లకు దరఖాస్తులు

**పర్చూరు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కారంచేడు మండల వ్యాప్తంగా సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో నేతాజీ తెలిపారు. మండలంలోని స్వర్ణ గ్రామ సచివాలయాల్లో అర్హులు తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వృద్ధులు, దివ్యాంగులు,వితంతువులతో పాటు చేనేత, మత్స్యకార,కల్లుగీత కార్మికులు,డప్పు కళాకారులు, ట్రాన్స్‌జెండర్లు కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఎంపీడీవో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 16వ తేదీలోపు సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నేతాజీ తెలిపారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన వివరాలతో సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.



## టిడిపి తీర్థం పుచ్చుకున్న గాజుల శ్రీహరి

**చీరాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**
చీరాల మున్సిపాలిటీ 22 వార్డు చెందిన కౌన్సిలర్ సీనియర్ నాయకులు గాజుల శ్రీహరి ఆధ్వర్యంలో 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరిక. చీరాల శాసనసభ్యులు శ్రీ మద్దులూరి మాలకొండయ్య గారు వారిని తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్,ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల పట్టణ అధ్యక్షులు దోగుపర్తి సురేష్ చీరాల మున్సిపల్ మాజీచైర్మన్ మించాల సాంబశివరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, జేఏసీ మామిడాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు



# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## - మార్కాపురం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల ధర్నా

## - సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**మార్కాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా సోమవారం మార్కాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. వాహన మిత్ర పథకాన్ని అర్హత కలిగిన ఆటో డ్రైవర్లందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ఆటో డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే జీఓ నంబర్లు 21, 31ను రద్దు చేయాలని, అన్ని ప్రాంతాల్లో ఆటో స్టాండ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ట్యాక్స్ విధానం వల్ల ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.15 లక్షలు, సహజ మరణం చెందిన వారికి రూ.5 లక్షల పరిహారం అందించే విధంగా ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఆటోల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తొలగించి, స్థానిక ఆర్టీఏ కార్యాలయాల వద్దే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు






చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

7:7.qxd 9/7/2026 11:38 PM Page 1



## ఎంబీబీఎస్ సీటు సాధించిన గంటవానిపల్లె సింగా చంద్రకళ

**- పలువురి అభినందనలు.. గ్రామంలో వెల్లువెత్తిన హర్షం**



**పెద్దదోర్నాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లెకు చెందిన సింగా పోలురాజు, కుమారి దంపతుల కుమార్తె సింగా చంద్రకళ ప్రతిష్టాత్మకమైన ఎంబీబీఎస్ సీటు సాధించి తన గ్రామానికి, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. కష్టపడి చదివి వైద్య విద్యలో ప్రవేశం సాధించిన చంద్రకళను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ వర్గాల ప్రముఖులు అభినందించారు. సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన చంద్రకళ పట్టుదలతో చదువుతూ లక్ష్యాన్ని చేరుకుంది. వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో విద్యలో ముందుకు సాగిన ఆమెకు ఎంబీబీఎస్ సీటు లభించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రకళ విజయం గ్రామంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు ఏవైనా పట్టుదలతో కష్టపడితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఆమె నిరూపించిందని కొనియాడారు. చంద్రకళను అభినందించిన పలువురు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని వైద్య విద్యలో సీటు సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమని, ఆమె భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. గ్రామానికి పేరు తీసుకొచ్చిన చంద్రకళను మరింత మంది విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. చంద్రకళ ఎంబీబీఎస్ సీటు సాధించిన విషయం తెలుసుకున్న గంటవానిపల్లె గ్రామంలో హర్షం వ్యక్తమైంది. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

## మార్కాపురం వార్త

## మార్కాపురం జిల్లా పార్టీ ఇంచార్జ్ బీటి నాయుడు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన నాయకులు



**యర్రగొండపాలెం, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ, రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా మార్కాపురం జిల్లా పార్టీ ఇంచార్జ్‌గా ఎమ్మెల్సీ అయిన బీటి నాయుడుని పార్టీ నియమకం పట్ల యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి మరియు మండల నాయకులు అహ్వానించా పరిణామం అంటూ పెర్కొన్నారు .బీటి నాయుడులాంటి నాయకుడు మార్కాపురం జిల్లాకు ఇంచార్జ్ గా నియమితం కావాడంతో రేపటి స్దానిక సంస్దల ఎన్నికలలో నాలుగు నియోజక వర్గాలలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయమంటు వ్యాఖ్యనించారు. ఆయన నియమకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# చినుకు జాడ లేదు.. రైతన్నకు నిద్ర లేదు!

**- వాన కోసం వెయ్యి కళ్లతో.. ఎండిపోయిన మార్కాపురం పొలాలు**

**- 61.6 శాతం వర్షపాతం లోటు ..**

**- ఖరీఫ్‌కు కరువు దెబ్బ వేసిన కొద్దిపాటి పంటల పరిస్థితిపైనా రైతుల్లో ఆందోళన**

**మార్కాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

చినుకు కోసం రైతన్న వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాడు. ఆకాశం వైపు ఆశగా చూస్తున్నా.. మేఘాలు కరుణించడం లేదు. ఒకవైపు వర్షాభావం.. మరోవైపు పంటలపై పెట్టుబడుల భారం.. ఇంకోవైపు వర్షం పడుతుందో లేదోనన్న ఆందోళన.. వెరసి మార్కాపురం జిల్లా రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగు తీవ్రంగా దెబ్బతింటోంది.



**ఎండిపోయిన పొలాలు....**

సాధారణంగా ఈ సమయానికి పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు ప్రస్తుతం బీటలు వారిన నేలతో దర్శనమిస్తున్నాయి. వర్షాలు లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో రైతులు పంటలు వేయక పొలాలను బీడుగా వదిలేశారు. మరికొందరు వర్షం వస్తుందన్న ఆశతో ఆలస్యంగా విత్తనాలు వేశారు. అయితే ఆ తర్వాత కూడా సరైన వర్షం లేకపోవడంతో ఆ పంటల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

**61.6 శాతం లోటు...**

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు జిల్లాలో 94.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇదే కాలంలో సాధారణంగా 246.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 61.6 శాతం లోటు నెలకొంది. వర్షపాతం లోటు తీవ్రంగా ఉండటంతో వ్యవసాయ రంగంపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

**వేసిన పంటలకూ కష్టకాలమే....**

వర్షాలు వస్తాయన్న ఆశతో కొందరు రైతులు పత్తి, కంది, మినుము, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారు. అయితే వరుణుడు ముఖం చాటేయడంతో భూమిలో తేమ తగ్గిపోతోంది. మొలకెత్తిన పైర్లు ఎదుగుదల లేక వాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొంత కాలం వర్షాలు లేకపోతే పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

**పెట్టుబడులు పెట్టి.. ఆకాశం వైపు చూస్తూ..**

విత్తనాలు, ఎరువులు, దుక్కులు, కూలీల ఖర్చులు పెట్టి పంటలు వేసిన రైతులకు ఇప్పుడు ప్రతి మేఘం ఆశను కలిగిస్తోంది. పొలంలో పరిస్థితిని చూసి ఆందోళన చెందుతున్న రైతులు.. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఒక్క మంచి వర్షం పడితే పంటలకు ప్రాణం వస్తుందని ఆశిస్తున్నారు.

**సెప్టెంబర్ వానపైనే ఆశలు....**

ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు సెప్టెంబర్ వర్షాలు కీలకంగా మారాయి. ఈ నెలలోనైనా సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఇప్పటికే సాగు చేసిన పంటలకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది. లేదంటే సాగు మరింత దెబ్బతిని రైతులపై ఆర్థిక భారం పెరిగే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చినుకు జాడ కోసం రైతన్న కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి. పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు నెర్రలు బారడంతో.. మార్కాపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు రైతన్న కష్టాలను కళ్లకు కడుతున్నాయి. ఎల్‌నినో ప్రస్తావనను తొలగించండి.

## మృతదేహం కనిపించినా స్పందించలేదు ?

**- వినయ్ మృతదేహం కొట్టుకుపోతుంటే అధికారులు ఎక్కడా?**

**- యువకుల ఆచూకీ కోసం రోడ్డెక్కిన కటకానిపల్లి గ్రామస్తులు**







**పెద్ద దోర్నాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో గల్లంతైన యువకుల ఆచూకీ కోసం కటకానిపల్లి బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. గల్లంతైన వినయ్ మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో కనిపించినప్పటికీ సకాలంలో స్పందించిమృతదేహాన్ని వెలికితీయలేదని గ్రామస్తులు , బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. కటకానిపల్లి సమీపంలోని వెలుగొండ ఫీడర్ కాలువలో ఇద్దరు యువకులు మూడు రోజుల క్రితం గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన వారిలో పుప్పాల రాజ్‌కుమార్, పుప్పాల వినయ్‌కుమార్ ఉన్నట్లు విధితమే. ప్రమాదం జరిగినప్పటి నుంచి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, వినయ్ మృతదేహం నీటిపైకి తేలి కనిపించిన సమయంలో దానిని గుర్తించిన గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన స్థాయిలో స్పందన కనిపించలేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. తమ కళ్లముందే మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుంటే అధికారులు ఎక్కడ ఉన్నారంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

**రోడ్డెక్కిన గ్రామస్తులు :**

మృతదేహాల వెలికితీతలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ కటకానిపల్లి గ్రామస్తులు, యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం రోడ్డెక్కారు. మార్కాపురం-దోర్నాల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులు కూడా ఆందోళనలో పాల్గొని తమ పిల్లల ఆచూకీ త్వరగా తేల్చాలని డిమాండ్ చేశారు.

**నిలిచిపోయిన వాహనాలు :**

గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించడంతో మార్కాపురం-దోర్నాల రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ఎర్రగొండపాలెం సిఐ కె.అజయ్ కుమార్ స్థలానికి చేరుకొని బాదిత కుటుంబాలతో మాట్లాడారు. గల్లంతైన మృతదేహాలు వెతికి స్వాధీనం చేసేంతవరకు ధర్నా చేస్తామని భీష్మించారు. సిఐ అజయ్ కుమార్ వారితో చర్చించి ధర్నాను శాంతింప చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు వెలుగొండ ప్రాజెక్టు చూసుకొని తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా కటకానిపల్లి వద్ద ధర్నా చేస్తున్న బాధితులకు మద్దతు తెలిపి మార్కాపురం తీసుకెళ్లారు.

## మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

**- ఒక్కొక్కరికి రూ 50 లక్షల పరిహారం ఇవ్వాలి**

**- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ డిమాండ్**



**మార్కాపురం ,ప్రభాతవార్త ప్రతినిధి**

శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్‌లో గల్లంతైన యువకుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ కోరారు. మార్కాపురం కలెక్టరేట్ లోజాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులను సోమవారం కలిసి మృతుల కుటుంబాల పరిస్థితిని వివరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన దోర్నాల మండలం కటకానుపల్లె గ్రామ యువకులు ఈనెల 5వ తేదీన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిన వినయ్ కుమార్ (22), రాజ్‌కుమార్ (23) కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవివి ప్రసాద్, జిల్లా పార్టీ కార్యదర్శి ఎం ఎల్ నారాయణ లతో కలిసి డాక్టర్ కె నారాయణ కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ను కలిశారు. డాక్టర్ నారాయణ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే యువకులు మృత్యువాతకు గురికావడం చాల బాధాకరమని, ఈ పరిస్థితుల్లో ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ 50 లక్షల పరిహారం అందించాలని జాయింట్ కలెక్టర్ ను కోరారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల నిర్వాసితులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని ఆయన కోరారు. డాక్టర్ కె.నారాయణ వెంట పార్టీ నాయకులు అందె నాసరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కల్యాణ్ తదితరులు ఉన్నారు.

## కనిగిరి కరువు నేలకు వెలిగొండ వరం

**- 1.10లక్షల ఎకరాలకు సాగునీరు..2.40 లక్షల మందికి తాగునీరు**



**కనిగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి కరువు నేలకు వెలిగొండ ప్రాజెక్టు వరంగా మారనుందని సీఎస్‌పురం మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం సీఎస్‌పురం మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిపనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలోనియోజకవర్గానికి వెలిగొండ జలాలుఅందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కనిగిరి నియోజకవర్గంలో సుమారు 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు, 2.40 లక్షల మందికి తాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కరువు ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయానికి ఊతం లభించడంతోపాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపడుతోందన్నారు. వెలిగొండ జలాలతో కనిగిరి ప్రాంతం వ్యవసాయపరంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు జిల్లా సీఫ్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తోడేటి అల్లూరయ్య, సీఎస్‌పురం పట్టణ అధ్యక్షుడు బత్తుల వెంకటాద్రి, బత్తుల పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'పేద రోగులకు ఆపన్న హస్తం - స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్'



**కనిగిరి, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పేద రోగులు, వారి బంధువులు మరియు ఆహార వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి ఉచిత భోజన వసతి కల్పించి ఆపన్నహస్తం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, అనాధలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రస్ట్ సభ్యులు స్వయంగా వండిన భోజనం పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, పేదవారికి ఆహారం అందించడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. 'మనము చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశను నింపుతుంది. ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ మరెందరికో ఉపశమనం కలిగించడం మా లక్ష్యం' అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది రోగులు, వారి బంధువులు, పేదలు ఉపశమనం పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మీరా మొహిద్దిన్, భాస్కర్, కిషోర్ బాబు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

**జాతీయస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చూపిన**

## స్ప్రింగ్ బోర్డు పాఠశాల విద్యార్థులు



**గిద్దలూరు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త**

జికెఎంఎ వారి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీఆదివారం నిర్వహించిన 13వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలో గిద్దలూరు పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు స్కూల్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చూపారు. 8సం"రాల బాలుర కటా విభాగంలో ఎస్ రిషిత్, ఎస్ గుణశేఖర్, ఎస్‌కె సాకీబ్ మరియు ఎస్‌కె అర్షద్‌లు బంగారు, రజత మరియు కాంస్య పతకాలు సాధించారు. 9,10,11,13 సం"రాల బాలికల కటా విభాగంలో ఆర్ యగ్నశ్రీ, ఎస్‌కె అర్షియ, పి మాధురి, ఎస్ దీక్షిత మరియు టి.తనుశ్రీ బంగారు మరియు కాంస్య పతకాలు మరియు9,10,11మరియు 13సం"రాల కుమితే(ఫైట్) విభాగంలో పి మాన్విత్ కార్తీ, ఎస్ తరుణ్, ఎస్ అలెక్స్, ఎస్‌కె సమీర్ మరియు ఎస్‌కె అర్షద్ లు అత్యుత్తమ ప్రతిభ కనపరచి బంగారు, రజత మరియు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా స్ప్రింగ్ బోర్డ్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జెవి నారాయణ, ప్రిన్సిపాల్ జె శ్వేత ప్రియదర్శిణి మరియు డైరెక్టర్ మణిచైతన్యలు కరాటే మాస్టర్ ఎస్‌డి షాషావలిని మరియు విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. మున్ముందు మరిన్ని విజయాలను సాధించి తమ పాఠశాలకు, ది ఫైటర్స్ స్పోర్ట్స్ కరాటేడో అకాడమికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలయ్యను

**పరామర్శించిన కృష్ణ కిషోర్ రెడ్డి**

**గిద్దలూరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్త**

గిద్దలూరు మార్కెట్ యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్యను నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య ఇటీవల హాస్పిటల్‌లో సర్జరీ చేయించుకుని మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలోని ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిశోర్ రెడ్డి బాలయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా బాలయ్య ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని విశ్రాంతి తీసుకొని జాగ్రత్తలు పాటించాలని కృష్ణకిషోర్ రెడ్డి బాలయ్యకు సూచించారు. బైలడుగు బాలయ్యను పరామర్శించిన వారిలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడిఓబుల్‌రెడ్డి, గంగనపల్లి శ్రీనివాసులు (నంది శ్రీను), కడియం శేషగిరి, భూమి రెడ్డి రామచంద్ర రెడ్డి, తదితర నాయకులు ఉన్నారు.

## దళిత సీనియర్ నేత పుట్టిన రోజు వేడుకలు



**యర్రగొండపాలెం, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ దళిత సీనియర్ నాయకుడు మెడబలిమి అచ్యుత్‌రావు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి కేక్ కట్ చేయించి అచ్యుత్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు . ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని కాంక్షించారు . ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు .పేరం రమణరెడ్డి .ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, షేక్ మస్తాన్‌వలి, మాజీ ఎంపీపీ మంత్రు నాయక్, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, వేగినాటి శ్రీనివాస్, ఆకుల రమేష్, షేక్ ఖలీల్ తో పాటు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అచ్యుత్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**అత్యంత వైభవంగా'జెండా గణేష్' ఆగమనం**

**చీరాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

జాండ్రపేట నందు జెండా గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో, దేశభక్తి భావనలతో నిర్వహించే జెండా గణేష్ ఉత్సవాలు ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యా అధిదులుగా చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి శ్రీ మద్దులూరి మహేంద్ర నాథ్ గారు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వాహించారు. జాండ్రపేట 'జెండా గణేష్' విగ్రహం ఈసారి 20 అడుగుల బారి గణేష్ విగ్రహం రూపంలో భక్తులకు దర్శనమివ్వనుంది.

## టీడీపీ నాయకత్వ శిక్షణలో ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

ప్రజాప్రతినిధుల సదస్సులో శిక్షణ కార్యక్రమాలకు హాజరు

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధుల నాయకత్వ సదస్సులో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సులో ప్రజాప్రతినిధులకు నాయకత్వ లక్షణాలు, ప్రజలతో మమేకం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడం తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయడం వంటి విషయాలపై శిక్షణ జరిగింది. టీడీపీ ప్రజాప్రతినిధుల పనితీరును మరింత మెరుగుపరిచి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ నాయకత్వ సదస్సును నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## కనిగిరిలో బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన శాఖ ప్రారంభం





**కనిగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని కందుకూరు రోడ్డు కోర్టు ఎదురుగా బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన శాఖను సోమవారం ఘనంగా ప్రారంభించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ హెడ్ ఎంపీఎస్ సుధాకర్, గుంటూరు ఏజీఎం, రీజినల్ హెడ్ ఎం.నాగకుమార్, డిఆర్ఎం చంద్రమోళి, బ్రాంచ్ మేనేజర్ జి. జనార్దన్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి నూతన శాఖను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన నిర్వహించి, బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపకుడు మహారాజా సాయాజీరావు గాయక్‌వాడ్-111 చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన శాఖలో బ్యాంకింగ్ సేవలను పరిశీలించి, ఖాతాదారులతో మాట్లాడారు. వారి అవసరాలు, బ్యాంకింగ్ సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి నిర్వహించిన సమావేశంలో బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ హెడ్ ఎంపీఎస్ సుధాకర్ మాట్లాడుతూ.. బ్యాంక్ ఆఫ్ బరోడా 119 సంవత్సరాలుగా ఖాతాదారులకు విశ్వసనీయమైన, నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తూ దేశంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటిగా విస్తరించిందన్నారు. ఖాతాదారుల నమ్మకాన్ని చూరగొంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. కనిగిరి ప్రజలకు కూడా నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందించడంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ముందంజలో ఉంటుందని చెప్పారు. గుంటూరు ఏజీఎం, రీజినల్ హెడ్ ఎం.నాగకుమార్ మాట్లాడుతూ.. ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల బ్యాంకింగ్ సేవలు, రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. పొదుపు, కరెంట్ ఖాతాలు, వ్యవసాయ రుణాలు, బరోడా గృహ రుణాలు, బరోడా కార్ లోన్లు, విద్యా రుణాలు, బంగారు రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, వ్యాపార రుణాలు తదితర సౌకర్యాలను ఖాతాదారులు వినియోగించుకోవచ్చన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, వివిధ రకాల డిపాజిట్ పథకాలను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కనిగిరి పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, యువత, మహిళలు, చిన్నతరహా వ్యాపారులు నూతన శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు కోరారు. ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా, నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా శాఖ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తమ్మనేని సురేంద్ర రెడ్డి, ప్రముఖ ఆర్యవైశ్యులు గోనుగుంట్ల పవన్ కుమార్ , డిప్యూటీ డిఇఓ జి సంజీవని, రవీంద్రారెడ్డి బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు, వ్యాపారులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు భారీ స్థాయిలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

ong-8_ong-8.qxd 9/7/2026 11:16 PM Page 1



# దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంచడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

**- కలవకూరులో ఆయిల్ ఫామ్ సాగు ప్రారంభం**

**అద్దంకి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త**

దేశంలో వంట నూనెల దేశీయ ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ – ఆయిల్‌పామ్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తుందని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి పేర్కొన్నారు. సోమవారం కలవకూరులో ఆయిల్ ఫామ్ సాగును ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ అవకాశాలను కల్పించడంతో పాటు దేశీయ వంట నూనెల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక వాణిజ్య పంట అని, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసినట్లయితే రైతులకు దీర్ఘకాలం క్రమమైన, సుస్థిరమైన ఆదాయాన్ని అందించే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగును చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎంఈఒ ఒపి పథకం కింద ఆయిల్‌పామ్ మొక్కలను ఉద్యాన శాఖ ఉచితంగా అందజేస్తుంది. అంతేకాకుండా మొక్కల నిర్వహణకు హెక్టారుకు 5,250 రూపాయలు చొప్పున, అంతర పంటల సాగుకు హెక్టారుకు 5,250 రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు సబ్సిడీ అందించబడుతుంది. 10 ఎకరాల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను 90 శాతం సబ్సిడీతో, ఆపై భూమి విస్తీర్ణానికి 50 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అద్దంకి మండలం కలవకూరు గ్రామంలో నేడు ఆయిల్‌పామ్ మొక్కల నాటే కార్యక్రమం ప్రారంభమైంది. 2026–27 సంవత్సరంలో అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో సిరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. దీప్తి, ఉద్యాన అధికారి, అద్దంకి కె. వెంకట కృష్ణ, మండల వ్యవసాయ అధికారి, అద్దంకి, వెంకటేశ్వరరావు, మేనేజర్, సిరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





## వర్ష హాస్పటల్‌ను ప్రారంభించిన డాక్టర్ హృదయనాథ్

**కొరిసపాడు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :**

మండలంలోని మేదరమెట్ల గ్రామంలోని నాభిశిలవద్ద నూతనంగా నెలకొల్పిన వర్ష హాస్పటల్ ను సోమవారం నాడు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఈదుపుగంటి హృదయానంద్ ప్రారంభించారు. ఆయనతోపాటు ముఖ్యఅతిథిగా కోరిసపాడు తాసిల్దార్ జి వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్పటల్ను నెలకొల్పిన డాక్టర్ సుమ వర్ష పిన్నక రెయిన్ బో, బ్లాసమ్స్ వంటి ప్రముఖ పిల్లల హాస్పిటల్స్ లో సేవలు చేసి ఎంతో అనుభవాన్ని గడిచారన్నారు. ఆమె ఈ గ్రామంలో వైద్యశాలను నెలకొల్పటం ఎంతో అభినందనీయం అన్నారు. పిల్లల తల్లిదండ్రులు సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాసాలకు లోను కాకుండా తమ పిల్లలకు అత్యుత్తమవైద్య సేవలు ఈ హాస్పిటల్ నెలకొల్పడంద్వారా అందుబాటులోకి తెచ్చారన్నారు. మండలంలోని గ్రామాల ప్రజలే కాకుండా పరిసర గ్రామాలలోని ప్రజలు కూడా డాక్టర్ సుమ వర్ష టీం సేవలు వినియోగించుకుని ప్రోత్సహించవలసినదిగా వారు కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారితో పాటు డాక్టర్ చావల వంశీకృష్ణ మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## శ్రీరామ వృద్ధాశ్రమంలో అన్నదాన వితరణ

**అద్దంకి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :**

శ్రీరాముని జన్మ నక్షత్రం అయిన పునర్వసు సందర్భంగా సింగరకొండ అఖండ హరే రామ నామ క్షేత్రంలో రామ నామ సంకీర్తన భజనలో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం సింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో 250 మంది భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమం చైర్మన్ రావూరి రంగయ్య, నిర్వాహకులు పూర్ణయ్య, వెంకటరావు, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, రోటరీ అధ్యక్షులు పువ్వాడ రామకోటేశ్వరరావు, నరసింహారావు, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## కాలుష్య నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**అద్దంకి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :**

వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి స్వచ్ఛమైన గాలి ప్రాధాన్యతపై అంతర్జాతీయ దినం సందర్భంగా జడ్పీహెచ్ ఎస్ ధర్మవరంలో పర్యావరణ ప్రేమికుడు మన్నం త్రిమూర్తులు ఆధ్వర్యంలో పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే నీడ, పూల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వి శ్రీనివాసులు, చందలూరు నారాయణ రావు, షేక్ బాషా, సందిరెడ్డి శ్యామల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వివాహా వేడుకలలో చింతలపూడి

**అద్దంకి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :**

మండలంలో ధర్మవరం గ్రామానికి చెందిన మేకల శ్రీనివాసరావు కుమారుని వివాహ రిసెప్షన్‌కి అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరై నవ దంపతులు అశోక్,పూజిత లను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## చందలూరికి సత్కారం

**అద్దంకి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :**

వచన కవి చందలూరి నారాయణరావు రచించిన నా కంటె ముందు పుస్తకాన్ని అవిష్కరించారు. ఈ అవిష్కరణ అనంతరం చందలూరి నారాయణరావును పలువురు ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో డాక్టర్ ఫణీంద్ర బాబు, శ్రావణ్‌కుమార్, త్రిమూర్తులు, డివిఎం సత్యనారాయణ, గాడేపల్లి దివాకర్ దత్తు, రాఘవరావు, పొన్నూరు శ్రీనివాసులు తదితరులు వున్నారులు వున్నారు.



## విశ్రాంత ఉద్యోగ సంఘ నేతలకు సత్కారం

**అద్దంకి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర నేతలుగా ఎన్నికైన పలువురిని అద్దంకిలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా సత్కరించారు. యూనియన్ రాష్ట్ర ఆసోసియేట్ అధ్యక్షులుగా ఎస్. విశ్వరూపచారి, రాష్ట్ర కార్యదర్శిగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తులు ఏలూరులో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికలలో ఆయా పదవులకు ఎంపికైన నేపద్యంలో వీరుఇరువురిని సత్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల డిఏల విడుదలపై కూడ రాష్ట్ర యూనియన్ నేతలకు, రాష్ట్ర ప్రభుత్వానికి రిటైర్డు ఉద్యోగ సంఘ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



## అపరాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం - ఎఒ

**అద్దంకి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త**

అపరాల పంటల సాగు కు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. చక్రాయపాలెం గ్రామం లో నిర్వహించిన ఆత్మ నిర్భరత భారత్ కృషోణ్ణతి అపరాల సాగు లో భాగంగా వ్యవ సాయాధికారి మాట్లాడుతూ రాయితీ పై కందులు, మినుములు అందిస్తున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువ ఉంటుందని అందువలన అపరాల పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. రైతులు అందరూ ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకులు శివాని పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు పరిష్కారం

**వలేటివారిపాలెం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పిజిఆర్ఎస్ మీ కోసం మీ గ్రామంలో కార్యక్రమంలో భాగంగా వలేటివారిపాలెం మండల పరిధిలోశామీర్ పాలెం పంచాయతీ గతము లో కలెక్టర్, ఎమ్మెల్యే,పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జిలకు సంబంధించి అర్జీ దారులకు తెలియజేయటం జరిగినది కొత్తగా ఎవరైనా పరిష్కారం కాని సమస్యలపై అర్జీలు ఇచ్చిన స్వీకరించడం వాటి పరిష్కార దిశగా ప్రయత్నం చేయటం జరుగుచున్నది. కార్యక్రమంలో తాసిల్దార్, డిప్యూటీ ఎంపీడీవో నారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, వీఆర్వోలు పంచాయతీ సెక్రెటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధి..
## ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లె నిద్ర

**- మండల స్పెషల్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు (డి.డి,భూగర్భ జలం)**

**జె. పంగులూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమంలో ప్రజల సమస్య లను తక్షణం పరిష్కరించేలా నిర్ణయాలను తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు (డి.డి,భూగర్భ జలం) అన్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశాలతో జె.పంగులూరు మండలంలో పల్లె నిద్ర తరహాలో మండల స్థాయి అధికారులతో మండల స్పెషల్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు, టి.కొప్పెరపాడు గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, యువతి, యువకులు, రైతులు, ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈరోజు రెండు అర్జీలు వచ్చాయని, అంతకముందు వచ్చిన అర్జీలపై చర్యలు తీసుకొనుట మరియు కొత్త అర్జీలను పరిశీలించి సంబంధించి నఅధికారుకు బదిలీ చేయడం జరిగిందని, అర్జీలను పరిశీలించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని అన్నారు. మండలం లోని ఒక్కొక్క గ్రామములో పల్లె నిద్ర తరహాలో కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. తదుపరి సోమవారం పంగులూరు గ్రామములో నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున గ్రామస్థులు సదరు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి. సింగారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కె.స్వరూప రాణి, వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి, ఏపీఎం సి.హెచ్ కోటేశ్వరరావు, మండల అధికారులు, సంబంధిత గ్రామ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చీమకుర్తి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిల్లు ఢీకొన్న ప్రమాదంలో గోరోజి రాజా(42) అక్కడికక్కడే మరణించాడు. చీమకుర్తి మెయిన్ రోడ్డు లో శివాలయం సమీపాన సోమవారం ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని పాడి మీద పాలెం అంబేద్కర్ నగర్ కు చెందిన రాజా ఉదయాన్నే తన భార్యను ఒక హోటల్ వద్ద పనికి వదిలిపెట్టి తిరిగి గ్రామానికి వెళ్లే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. తలకు గాయాలైన అతను సంఘటనా స్థలంలోనే మరణించినట్టు తెలుస్తోంది. మృతుడు కొర్లమడుగు గ్రామానికి చెందినవాడు పాటిమీద పాలెం లో ఉంటూ రోజువారి పనులకు వెళ్తుంటాడని తెలుస్తోంది. మరొక బైకు నడుపుతున్న తొర్రగుడిపాడు గ్రామానికి చెందిన కొనికి శేషారావు కు కూడా తీవ్ర గాయాలయ్యాయని, చీమకుర్తి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు వెలుగొండ గురుకుల విద్యార్థులు

**కొనకనమిట్ల, సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, పీడీ పెద్దన్న, పీఈటీ శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల అద్దంకిలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్14 పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సందీప్, రోహిత్, యోగేష్, నిఖిల్, కళ్యాణ్, శ్రీరామ్, సంతోష్ విశేష ప్రతిభ కనబరిచి విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ పెద్దన్న, పీఈటీ శ్రీకాంత్ ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే తమ పాఠశాలకు స్కూల్ సాఫ్ట్ ఎక్స్ లెన్స్ 3కి ఎంపికైందని, కలెక్టర్ విజయ సునీత, డీఈఒ సోమ సుబ్బారావు చేతుల మీదుగా ఎక్స్‌లెన్స్ అవార్డు,ప్రశంసాపత్రం అందుకున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

## వెలిగొండ పూర్తి చేయడానికి శ్రమించిన ఇంజనీర్లకు కృతజ్ఞతలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రతిష్ఠాత్మకమైన వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుచే జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామానాయుడు నిరంతర కృషితో ఘనంగా ప్రారంభించి పశ్చిమ ప్రకాశం వాసుల చిరకాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి శ్రమించిన చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ ఒంగోలు కే.రమేష్‌ని, సూపరింటెండింగ్ ఇంజనీరు, వెలిగొండ ప్రాజెక్ట్ షేక్ అబుతాలిమ్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడమైనది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ ఒంగోలు కే.రమేష్ మాట్లాడుచూ నేడు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి జలవనరుల శాఖలో ఇంజనీర్ల నుండి క్రింది స్థాయి ఉద్యోగుల వరకు కష్టపడి పనిచేయడం వలన మాత్రమే ఇది సాధ్యం అయ్యింది అని, ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖామాత్యులు డాక్టర్ నిమ్మల రామా నాయుడు నిరంతర పర్యవేక్షణ మరియు సూపరింటెండింగ్ ఇంజనీరు షేక్ అభూతాలిమ్ కూడా చక్కగా క్రింది స్థాయి ఉద్యోగులను కలసి పనిచేయడం వలన మనం ప్రాజెక్ట్ ను పూర్తి చేసుకొన్నాం అని అన్నారు... ఈ సందర్భంగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ యన్ జి ఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్ సి హెచ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికం అయిన వెలిగొండ ప్రాజెక్ట్స్ ను పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు లో పనిచేసే ఉద్యోగులుగా తమకు గర్వకారణం గా ఉంది అని ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేసిన ప్రభుత్వానికి మరియు ప్రాజెక్టు పూర్తి కావడానికి కృషి చేసిన ఇంజనీర్లు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



## బల్లికురవలో భారీ వర్షం.. వేసవి తాపం నుండి ప్రజలకు ఊరట

**- ఎస్టి కాలనీలోకి వర్షపు నీరు**

**బల్లికురవ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ఖరీఫ్ కాలం కర్పూరంల కరిగిపోయిన తర్వాత వరుణ దేవుడు కరుణ చూపాడు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు మండలంలో భారీ వర్షం కురిసింది. స్థానిక ఎస్టీ కాలనీలోని నివాస గృహాలలోకి వర్షపు నీరు చేరింది. ఈ ఏడాదిలో ఇదే మొదటి వర్షం. ఖరీఫ్ కాలం ఆరంభం నుండి అన్నదాతలు పంటల సాగు కోసం భూములను సిద్ధం చేశారు. వేసవి ని మించిన ఎండలతాపంతో ప్రజలు తల్లడిల్లుతున్నారు తప్ప, ఒక్క చినుకు రాలలేదు. ఖరీఫ్ కాలం ముగిసి పోయింది. వరుణ దేవుని కరుణతో భూములు పదునెక్కటం తో ఆశల సేద్యాన్ని ఆరంభించేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. పుడమి పుత్రులు ఆశల సేద్యంతో అధిక ఫల సాయం అందుకోవాలని ఆశిద్దాం. కాలనీలో సైడ్ కాల్వల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కరోజు వర్షానికి ఇళ్లలోకి నీరు చేరితే, తుఫానులు ఏర్పడే సమయాలలో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కాలనీ వరద నీటిలో మునిగిన సమయంలో సైడ్ కాలవల నిర్మాణం కోసం అధికారులకు విజ్ఞప్తి చేశామని, ఆది నేటి వరకు కార్యరూపం దాల్చలేదని, ఫలితంగా తమ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండల కేంద్రమైన బల్లికురవలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



## ప్రతి సమస్యకు పరిష్కారం చూపటమే పల్లెవీక్షణం లక్ష్యం: తాసిల్దార్

**బల్లికురవ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

పల్లె ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపుటమే పల్లె వీక్షణం లక్ష్యమని తాసిల్దార్ రవి నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన బల్లికురవ సచివాలయం వద్ద పల్లె వీక్షణం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో వారి వద్దకే వెళ్లి తెలుసుకుంటూ, పచ్చని పల్లె సీమల నుండి సమస్యలను పారదోలుటమే ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రధానంగా సామాజిక పెన్షన్లు, పక్కా గృహాల నిర్మాణం, అంగన్వాడి కేంద్రాల పరిశీలన, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి సమస్య, ప్రజలకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ప్రధానంగా ఆరా తీయడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల ముంగిటకు 18 శాఖలకు పైగా అధికారులు సమస్యలను గుర్తించి పరిష్కారం చూపుతారన్నారు. 40 మందికి పైగా సామాజిక పెన్షన్ల కోసం అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, ఏఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మార్టూరు రహదారి అభివృద్ధి పనులు ఆరంభం

**బల్లికురవ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

రెండు దశాబ్దాలకు పైగా శిథిలావస్థకు చేరిన బల్లికురవ, మార్టూరు రహదారి అభివృద్ధి పనులకు సోమవారం సాయంత్రం క్లస్టర్ ఇంచార్జి మల్లినీడి గోవిందరావు, సంబంధిత గుత్తేదారు ఆంజనేయులు, పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులు ప్రారంభించారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో మండల ప్రజలు ఎదుర్కొంటున్న సుదీర్ఘ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ ఏడాది జనవరి 9వ తేదీన బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి లో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు రహదారి అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన చేశారు. రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి పరిచే క్రమంలో భాగంగా శాఖపరమైన అనుమతులలో కొంత జాప్యం జరిగింది. రూ.12 కోట్ల వ్యయంతో బల్లికురవ, నాగరాజు పల్లి గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్లు, మార్టూరు నుండి గన్నవరం రహదారిలో రెండున్నర కిలోమీటర్లు, కొమ్మాలపాడు నుండి కుందుర్రు రహదారిలో కొంత భాగం అభివృద్ధి పరిచే విధంగా ఈ ప్యాకేజీలో పనులు కొనసాగనున్నాయి. అదేవిధంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నాలుగు వైపులా సిమెంటు రహదారి అభివృద్ధి, సైడ్ కాలవలు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే వీటి నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయని గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు దరిశి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## బపల్లకి ఊరేగింపుతో పులకించిన పల్లె సీమలు

**బల్లికురవ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కృష్ణాష్టమి పర్వదినం వేడుక సందర్భంగా ఈనెల నాలుగవ తేదీన మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో శ్రీకృష్ణుని పీఠాన్ని ప్రతిష్టించారు. నాలుగు రోజులు పాటు కృష్ణ భగవానుడి నామ గానాలతో ముక్తేశ్వరం పులకించింది. కొండమీద ముక్తి లింగేశ్వరుడు, కొండ కింద శ్రీకృష్ణ భగవానుడు, భక్తజన నీరాజనాలు అందుకున్నారు. ప్రబోధసేవా సమితి, ఇందూజ్ఞానవేదిక, ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకలో చివరి రోజు అయిన సోమవారం కృష్ణయ్య పల్లకీ ఊరేగింపు కార్యక్రమం భక్తుల జయ జయ ధ్వానాల నడుమ భక్తి భావంతో కొనసాగింది. కమిటీ అధ్యక్షులు ఘడియం పెద్దరెడ్డి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి ఆశీస్సులతో ఈ, ఏడాది మండలంలోని ముక్తేశ్వరం గ్రామాన్ని ఉత్సవాల నిర్వహణ కోసం ఎంపిక చేసామన్నారు. గుంటూరు వేమవరం, దాచేపల్లి పట్టణం, లోను మూడు చోట్ల శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణ కొనసాగిన అనంతరం శ్రీ కృష్ణాష్టమి పండుగ విశిష్టత, శ్రీ కృష్ణుని జ్ఞానసందేశాలను, భగవద్గీత శ్లోకముల, వివరించటం, ముగింపు కార్యక్రమంలో భాగంగా సన్నాయి వాయిద్యములు, మహిళామణుల కోలాటములు, శ్రీకృష్ణ గోపిక వేషధారణలు, భగవద్గీత శ్లోక పఠణముల నడుమ పుష్పాలంకృత శ్రీకృష్ణ భగవానుని పల్లకిని భుజముల మీద మోస్తూ ముక్తేశ్వరం, సూరేపల్లి గ్రామాల పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించారు.





## సమస్యల పరిష్కారానికి పల్లె విక్ష

**కొండపి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారం కోసమే ప్రభుత్వం పల్లె వీక్షణ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని కొండపితాసిల్దార్ శ్రీనివాసరావు తెలియజేశారు. సోమవారం కొండపి సచివాలయ ఆవరణంలో పల్లె వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల కార్యాలయంలో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం మాదిరిగానే ప్రతి సోమవారం ఒక పంచాయతీలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అన్ని శాఖల అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఆయా పంచాయతీలో జరిగే పల్లె వీక్షణ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియజేస్తే అవకాశం ఉన్న ప్రతి సమస్యను ఇదే గ్రామ సభలో పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమం అధికారకంగా ప్రారంభించిన అనంతరం ప్రజల నుండి పలు సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించారు. అవకాశం ఉన్న అర్జీలకు అప్పుడే పరిష్కారం చేయగా మిగిలిన అర్జీలను పరిశీలించి త్వరలోనే వారికి పరిష్కారం చేయగలమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు వ్యవసాయ అధికారి ఎం మాల్యాద్రి ఆర్ అండ్ బి ఏ ఈ లక్ష్మీ దీప్తి హౌసింగ్ డిఇ పాల్గొనగా కార్యక్రమం తొలిసారి అయినా గ్రామస్తులు భారీ స్థాయిలో హాజరయ్యారు.



## కొత్త పెన్షన్లకు దరఖాస్తు స్వీకరణ

**వేటపాలెం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణను వేటపాలెం మండల వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేటపాలెం ఎంపీడీవో పాశం రాజారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల దరఖాస్తు కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అందులో భాగంగా సెప్టెంబర్ 7 నుండి 16వ తేదీ వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలం లోని స్వర్ణ గ్రామ సచివాలయాల్లో అర్హులు తమ దరఖాస్తులను స్వీకరించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారిని అర్హులుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. కావున అర్హత కలిగిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, ట్రాన్స్ జెండర్లు కొత్త పెన్షన్లకు స్వర్ణ గ్రామ సచివాలయాల యందు అవసరమైన వివరాలతో దరఖాస్తులను సమర్పించవలసినదిగా తెలియజేశారు.



# వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## - సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందాలి
## - పుల్లలచెరువు ఎస్సై బి సాంబశివరావు



**పుల్లలచెరువు సెప్టెంబరు 7 ప్రభాతవార్త**

వినాయక చవితి ఉత్సవాలు నియమ నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పుల్లలచెరువు ఎస్సై బి సాంబశివరావు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ఆయన కొన్ని సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాల అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా పొందాలని ఆదేశించారు. సెప్టెంబర్ 14వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని పుల్లలచెరువు ఎస్సై సాంబ శివరావు తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్/పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతులను సులభంగా ఒకే వేదిక ద్వారా పొందేందుకు కేటాయించిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అనుమతుల కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ సేవ పూర్తిగా ఉచితమని ఆయన స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

**ఆన్‌లైన్‌లోనే అనుమతులు :**

ప్రజలు వెబ్సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటి సభ్యుల వివరాలతో పాటు మరికొన్ని వివరాలను నమోదు చేసి దరఖాస్తును సమర్పించి విధంగా దరఖాస్తు చేసుకోవాన్నారు.

**దరఖాస్తు చేసుకునే విధానం :** గణేష్ ఉత్సవాల నిర్వహణకు మొదటగా దరఖాస్తు చేయదలచిన వారు కేటాయించిన వెబ్ సైట్ ఓపెన్ చేసి న్యూ అప్లికేషన్ అనే ఆప్షన్ ను ఎంచుకోవాలి. తరువాత దరఖాస్తు దారుని మొబైల్ నెంబర్ ను ఎంటర్ చేయవలయును. తరువాత సదరు మొబైల్ నెంబర్ కు వచ్చిన ఓటిపిని నమోదు చేయవలయును. ఆ తరువాత దరఖాస్తు దారుని పేరు, అడ్రస్ మరియు కమిటి సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధి లోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయవలయును. అప్లికేషన్ ఐడి నెం. (యూనిక్ ఐడి) జనరేట్ చేయబడి, సదరు దరఖాస్తు పోలీస్‌శాఖ యొక్క అనుమతి కోసం వారి లాగిన్స్‌కు వెళుతుంది. అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి, అనుమతించిన తరువాత ఆ వివరాలు వెబ్ సైట్ నందు వస్తాయని తెలిపారు. దీనికోసం ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేశులను మాత్రమే ప్రతిష్ఠించాలన్నారు.

# వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం చేయూత

## - పట్టాలతో పునరావాసానికి శ్రీకారం

**మార్కాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**





వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తమ ఇళ్లు, పొలాలు, ఊర్లను త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. నిర్వాసితుల పునరావాసం, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మార్కాపురం కలెక్టరేట్ ప్రాంగణంలో గోగులదిన్నె లేఔట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించిన వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసిత సుంకేసుల గ్రామ ప్రజలకు ఇళ్ల పట్టాలు, నిత్యావసర వస్తువులు, ఇతర సహాయ సామగ్రిని కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లమల సాగర్‌కు కృష్ణాజలాలను తీసుకురావడంలో భాగంగా 11 గ్రామాల ప్రజలు తమ సర్వస్వాన్ని త్యాగం చేసి వేర్వేరు ప్రాంతాలకు తరలివెళ్లారని తెలిపారు. వారి త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వాసిత కుటుంబాలకు అదనపు సహాయం అందించేందుకు ప్రత్యేక జీవో జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పునరావాసంలో భాగంగా ప్రతి కుటుంబానికి 25 కిలోల నాణ్యమైన బియ్యం, 2 కిలోల వంటనూనె, చక్కెర, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తదితర నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు చీర, గాజులు, పసుపు, కుంకుమతో పాటు పశువుల పోషణ కోసం దాణా కూడా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. 26 ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ, పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుమారు 26 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి నిర్వాసిత కుటుంబానికి ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యంపునరావాస ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ తదితర ప్రాథమిక మౌలిక వసతులను వేగంగా పూర్తి చేసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుంకేసుల గ్రామ నిర్వాసితుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. నిర్వాసితులకు భోజన వసతితో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యే వరకు కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు, సుంకేసుల గ్రామ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

## - సింగిల్ విండోలో ఉచిత అనుమతులు
## - ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**మార్కాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు జిల్లా ప్రజలు, ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ మండపాలు, నిమజ్జన ప్రాంతాల వద్ద ముందస్తుగా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ సౌకర్యం, గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక పరికరాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ విండోలో అనుమతులుగణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్, ఫైర్, మున్సిపల్/పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతులను ఒకే వేదిక ద్వారా పొందేందుకు ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవ్ .నెట్ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు మొబైల్ నంబర్, ఓటీపీ నమోదు అనంతరం కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం-మండపం ఎత్తు, ప్రతిష్ఠ తేదీ, నిమజ్జనం ప్రదేశం, సమయం, వాహనం తదితర వివరాలను నమోదు చేసి దరఖాస్తు సమర్పించాలి.దరఖాస్తు అనంతరం యూనిక్ అప్లికేషన్ ఐడీ జనరేట్ అవుతుందని, అధికారులు పరిశీలించి అనుమతి మంజూరు చేసిన తర్వాత క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ఎన్ ఓ సి జారీ చేస్తారని తెలిపారు. ఆ పత్రాన్ని ప్రింట్ తీసుకుని మండపంలో ఉంచుకోవాలని సూచించారు. అనుమతుల కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి మండపాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో సురక్షితంగా చేయించాలని ఎస్పీ సూచించారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, రెచ్చగొట్టే లేదా కించపరిచే ప్రసంగాలు చేయరాదన్నారు. రోడ్లపై మండపాలు, విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, బ్యానర్లు, ఫ్లెక్సీలు రాకపోకలకు ఆటంకం కలిగించకుండా చూడాలని సూచించారు. బాణసంచా వినియోగించరాదని, ఊరేగింపుల్లో అసభ్యకర ప్రదర్శనలు, అనుచిత నృత్యాలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా డీజేలు, అధిక శబ్దం చేసే వాయిద్యాలు, ప్రత్యేక వేషధారణలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. నిమజ్జనానికి కేటాయించిన సమయం, ప్రదేశం, ఊరేగింపు మార్గాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేశ విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని కోరారు. వదంతులను నమ్మొద్దుసోషల్ మీడియాలో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని వార్తలు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, వాటిని ఫార్వర్డ్ చేయవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానం లేదా సమస్య తలెత్తితే స్థానిక పోలీసులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని కోరారు. జిల్లా ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, యువత, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112కు లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు సమాచారం అందించాలని సూచించారు.

# గిద్దలూరులో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప రెడ్డిసుడిగాలి పర్యటన

## - వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు
## - విద్యార్థుల సమస్యలపై ఆరా



**గిద్దలూరు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప రెడ్డి సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా పలు సాంఘిక సంక్షేమ, బీసీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఆయనను విద్యార్థులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యలను విన్న విజయ ప్రతాపరెడ్డి వాటిపై ఆరా తీశారు. అనంతరం రాచర్ల రోడ్డు పోస్ట్‌మెట్రిక్ బీసీ బాలుర వసతి గృహానికి వెళ్లగా అక్కడ వార్డెన్, సరిగా విద్యార్థులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆయన అక్కడి నుంచి వెనుదిరిగారు. ఎస్‌డబ్ల్యూ మరియు డిడిలను చైర్మన్‌ని కలవాలని ఆదేశాలు జారీ చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం




**గిద్దలూరు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని 132/33కెవి సబ్ స్టేషన్‌లో అత్యవసర సాంకేతిక మరమ్మతుల కారణంగా నేడు మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు గిద్దలూరు, కొమరోలు,రాచర్ల మండలాలలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోగల గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డిఈఈ బివై శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, రైతులు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# కురిచేడులో ప్రారంభమైన పల్లెవీక్షణ



**కురిచేడు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కురిచేడులో సోమవారం నాడు పల్లె వీక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపీడీవో సత్యప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మండలంలోని వివిధ శాఖల అధిపతులు కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ల దరఖాస్తులకు అవకాశం ఇవ్వడంతో ఎక్కువ సంఖ్యలో వృద్ధులు, వితంతువులు పెన్షన్ల కోసం దరఖాస్తులను అధికారులకు అందించారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపెద్దలు అధికారులను కోరారు. చెరువులను వీలైనంత త్వరగా నింపాలని కోరారు. మండలంలోని ఏ శాఖకు సంబంధించిన సమస్య అయిన వెంటనే పరిష్కరిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ టి.లక్ష్మీ, ఎంఈఓ పి.చిన్నకోటయ్య, ఎన్నెస్పీ డీఈ అక్బర్‌భాష, హౌసింగ్ ఈఈ వెంకట కొండయ్య, ఈవోఆర్డీ కేవీఎస్ రాజు, కురిచేడు వీఆర్వో-1 నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సుంకేసుల వద్ద రిజర్వాయర్లో వినయ్ మృతదేహం లభ్యం

## - మరో యువకుడి మృతదేహం కోసం విస్తృతంగా గాలింపు





**పెద్దదోర్నాల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

వెలుగొండ ఫీడర్ కాలువలో గల్లంతైన యువకుల విషాద ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్లంతైన వినయ్ మృతదేహం సుంకేసుల రిజర్వాయర్ వద్ద లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.మూడు రోజులుగా నీటి ప్రవాహంలో గల్లంతైన యువకుల ఆచూకీ కోసం అధికారులు, రెస్క్యూ సిబ్బంది విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వినయ్ మృతదేహం సుంకేసుల రిజర్వాయర్ పరిసరాల్లో లభించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.ఇదిలా ఉండగా, మరో యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. రెస్క్యూ బృందాలు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలిస్తూ మృతదేహం కోసం అన్వేషణ కొనసాగిస్తున్నాయి. గల్లంతైన ఇద్దరు యువకుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకరిది సోమవారం వివాహం కాగా మరొక రి మృతదేహం సోమవారం సాయంత్రం వెలుగు చూసింది. దీంతో మృతదేహం దొరికినందుకు విషాదమే మిగిలింది, కనిపించని రాజు మృతదేహం కోసం వేదనతో ఎదురుచూస్తున్నారు. తమ పిల్లల ఆచూకీ కోసం రోజులుగా ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదనే మిగిలింది. మిగిలిన యువకుడి ఆచూకీ త్వరగా లభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.మరోవైపు సహాయక చర్యలను అధికారులు నిరంతరం పర్యవేక్షి స్తూ, గాలింపు ప్రాంతాలను విస్తరిస్తున్నారు. మరో మృతదేహం లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగనున్నాయి.

# 'మీకోసం పీజీఆర్ఎస్ మీ గ్రామంలో" ప్రారంభం



**కందుకూరు సెప్టెంబరు 7,ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు సోమవారం 'మీ కోసం పీజీఆర్ఎస్ మీగ్రామంలో ' అనే కార్యక్రమం ప్రారంభించారు.ఇప్పటివరకు మండల,డివిజన్,జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమం ఇక నుంచి గ్రామాల్లో నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి 'మీకోసం పీజీఆర్ మీ గ్రామంలోనే' అనే పేరు పెట్టారు.పల్లెనిద్ర తరహాలో ప్రతి సోమవారం మండలంలోని ఒక గ్రామంలో నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.ఈ నేపథ్యంలో సోమవారం నియోజకవర్గంలో కందుకూరు మండలం కంచరగుంట,వలేటివారిపాలెం మండలం శామీరపాలెం, లింగసముద్రం మండలం యర్రారెడ్డిపాలెం, గుడ్లూరు మండలం చెమిడిదపాడు,మర్రిపూడి మండలం గుండ్లసముద్రంలతోపాటు పొన్నలూరు, ఉలవపాడు మండల కేంద్రాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఆయా మండలాల ఎంపీడీవోల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు.అనంతరం సదరు అర్జీలపై క్షేత్రస్థాయి పర్యటనలో పరిశీలన చేశారు. ఇందులో బాగంగా కంచరగుంట గ్రామంలో ఎంపీడీవో రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు మండల ప్రత్యేక అధికారిగా హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.తహసిల్దార్ పి.మురళితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.అదేవిధంగా శామీరపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకరరావు,తహసిల్దార్ లావణ్య, యర్రారెడ్డిపాలెంలో ఎంపీడీవో కట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

# బీజేపీ జిల్లా సభ్యుడుగా మన్నేపల్లి



**కందుకూరు సెప్టెంబరు 7,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా భారతీయ జనతాపార్టీ కార్యవర్గ సభ్యునిగా మన్నేపల్లి వరప్రసాదరావు నియమితులయ్యారు.కందుకూరు పట్టణ భాజపా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా ఆయన పనిచేశారు.ఈ నేపధ్యంలో ఆయనకు జిల్లా కమిటీలో చోటుదక్కింది.ఇందుకు సహకరించిన బీజేపీ నేతలు అధ్యక్షుడు శ్రీనివాస్ భరత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మన్నేపల్లి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ నెల 16వ తేదీ వరకు నిర్వహించబోవు సేవా సంపర్క్ అభియాన్‌లో విస్తృతంగా ప్రజలకు తెలియజేసి బిజెపి అభివృద్ధికి కృషి చేస్తానని మన్నేపల్లి వర ప్రసాదరావు తెలిపారు.

# విద్యుత్ వినియోగంపై విజిలెన్స్‌దాడులు

## - 7.55 లక్షల జరిమానా



**కందుకూరు సెప్టెంబరు 7,ప్రభాతవార్త**

కందుకూరు మండలంలో సోమవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యుత్‌వినియోగంపై 15మంది అధికారులు, 65మంది సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 1728సర్వీసులను తనిఖీ చేశారు. ఇందులో రకరకాల విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించారు. రూ.7.55లక్షల జరిమానా విదించినట్లు జిల్లా ఈఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. అధికారులు 26బృందాలుగా ఏర్పడి మండలంలోని పలు గ్రామాలను పరిశీలించారు.అదనపులోడు వినియోగంపై ఆరా తీశారు. డీపీ ఈఈ పద్మావతి,డీఈ ఎం.రాఘవేంద్రరావు,కందుకూరు ఈఈ వీరయ్య ఏఈ శ్రీనివాసరావుతోపాటు వివిధ మండలాల ఏఈలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ అంకాళమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



**రాచర్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండలంలోని జెపి చెరువు గ్రామంలో శ్రీశ్రీశ్రీ అంకాళమ్మ అమ్మవారి నూతన దేవాలయంలో అంకాళమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నూతన దేవాలయం సంప్రోక్షణ మరియు విమాన గోపుర శిఖర కలశ ప్రతిష్ట మరియు అంకాళమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు కలశములకు పునః ఆరాధన గం 9:26 నిమిషాల నుండి ్గగ 10:26 నిమిషాల వరకు యంత్ర, మరియు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, విమాన గోపుర కలశ శిఖర ప్రతిష్ట కళాన్యాసము, నేత్రోన్మిళనము, సహస్రనామార్చన, పూర్ణాహుతి, మంగళ హారతి,వేద ఆశీర్వచనము, తీర్థ ప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామ ప్రజలతోపాటు తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు హోమాలు జరిపించి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమం విజయవంతం పట్ల నిర్వాహకులు భక్తులకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కెపి నాగార్జున రెడ్డి :**

శ్రీశ్రీశ్రీ అంకాళమ్మ అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమంలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే గిద్దలూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కెపి నాగార్జున రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమంలో పలువురు వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో నిబంధనలు పాటించండి

## - సీఐ అన్వర్‌బాషా



**కందుకూరు సెప్టెంబరు 7,ప్రభాతవార్త**

గణేష్ ఉత్సవం సందర్భంగా పోలీస్ నిబందనలు పాటించాలని పట్టణ సీఐ అన్వర్‌బాషా నిర్వహకులుకు సూచించారు. శాంతి భద్రతల దృష్ట్యా ఊరేగింపు నందు డీజేలకు మరియు సౌండ్ బాక్స్ లకు అనుమతి లేదన్నారు. ఈమేరక ఆయన సోమవారం కందుకూరు సర్కిల్ పరిధిలోని కందుకూరు టౌన్ రూరల్ మరియు ఉలవపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల సౌండ్ సిస్టం మరియు డీజే ఆపరేటర్ యొక్క యజమానులతో సమావేశమైనారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాబోవు గణేష్ ఉత్సవ ఊరేగింపు నందు ఎటువంటి సౌండ్ బాక్స్ లకు మరియు డీజే బ్యాంక్స్ లకు అనుమతి లేదని మరియు ఎవరైనా సదరు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.ఈ సమావేశము నందు కందుకూరు టౌన్ ఎస్ఐ బండ్ల బార్గవ్,రూరల్ ఎస్సై బాలక్రిష్ణలుతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

## - గుడ్లూరు సీఐ రమేష్



**గుడ్లూరు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలంలో గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని గుడ్లూరు సిఐ రమేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ ఆన్లైన్ పోర్టల్ ద్వారా గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసే వినాయక చవితి మండపాలను గురించిన వివరాలు పోలీస్ శాఖకు ఆన్లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పంచాయతీలు, అనుమతితో పాటు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. గ్రామాల్లో వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ఒక కమిటీగా ఏర్పడి అక్కడ చేసే కార్యకలాపాల పూర్తి సమాచారాన్ని పోలీసులు అందించాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా కమిటీ వివరాలు తెలుపుతూ నిమజ్జన కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డీజే తదితర బాణాసంచా కాల్చడం తదితర వివరాలన్నీ కూడా ముందుగానే తెలియచేయాలని,నిర్వాహక కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండపాల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై వెంకట్రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిప్పంటించుకున్న యువకుడు

**కొనకనమిట్ల, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్త పై భార్య చీదర్ల ప్రసన్న ఫిర్యాదు చేసిందని స్టేషన్ ఆవరణలో పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్న సంఘటన సోమవారం రాత్రి సంచలనం రేకెత్తించింది.మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ల ప్రసన్న కంభం పట్టణానికి చెందిన చీధర్ల జగదీష్ తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప కలదు. భర్త జగదీష్ రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి నానాహింస పెట్టే వారని గత ఏడాది నవంబర్లో కూడా భార్య ప్రసన్న స్టేషన్లో ఫిర్యాదు చేసిందని భార్యాభర్తలకుసర్ది చెప్పి అప్పుడు పంపించడం జరిగిందని, మరల 2 తేదీన ప్రసన్న స్టేషన్లో చేసిన ఫిర్యాదు మేరకు జగదీష్ ను వారి కుటుంబసభ్యులను స్టేషన్కు పిలిపించడం జరిగిందని ఎస్సై బి శ్రీకాంత్ తెలిపారు. వారు స్టేషన్కు వచ్చినప్పుడు నేను పని నిమిత్తం బయటకు వెళ్లి పోలీస్ స్టేషన్ కు వచ్చేసరికే వారిరువురూ గొడవపడి నువ్వు ఎందుకు ఫిర్యాదు చేసావని భార్యతో గొడవపడి జగదీష్ తనతో తెచ్చుకున్న లైటర్ తో నిప్పంటించుకొని కేకలు వేయడంతో బయట ఉన్నవారు గమనించి మంటను అదుపు చేయటం జరిగిందన్నారు.అప్పుడే వచ్చిన నేను జగదీష్ వద్దకు వెళ్లి పరిశీలించగా మద్యం ఫుటుగా సేవించి ఉన్నాడని ,ఒంటిపై పెట్రోల్ పోసుకొని స్టేషన్కు వచ్చి భార్యను బెదిరించే క్రమంలో లైటర్‌తో నిప్పంటించుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వెంటనే ఆటోలో తరలించే క్రమంలో 108 వాహనం రావటంతో అందులో జగదీష్ ను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని ఆయన తెలిపారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# తాగునీటి బోరును పునరుద్ధరించాలి

## - ఎంపీడీవోకు ఎస్సీ కాలనీ యువకుల వినతి



**పుల్లలచెరువు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

పుల్లలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ తాగునీటి బోరును పునరుద్ధరించి ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ కాలనీకి చెందిన యువకులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. స్థానికుల వివరాల ప్రకారం 2007 సంవత్సరంలో అప్పటి సర్పంచ్ లింగంగుంట్ల నాగమ్మ ఆధ్వర్యంలో రామానాయుడు చెరువు పక్కన ఉన్న అలుగు వద్ద పంచాయతీ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేసి, పైపుల ద్వారా ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ బోరు సుమారు 16 సంవత్సరాల పాటు ప్రజలకు తాగునీటిని అందిస్తూ ఎంతో ఉపయోగకరంగా ఉందని వారు తెలిపారు.అయితే ప్రస్తుతం సరైన నిర్వహణ లేకపోవడంతో బోరు చుట్టూ పెద్ద ఎత్తున చెట్లు, పొదలు పెరిగి నిరుపయోగంగా మారిందని యువకులు తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో బోరు వినియోగంలో లేకపోవడంతో, బోరు పక్కనే ఉన్న పొలం వారు దానిని మరమ్మతు చేయించుకుని తమ అవసరాలకు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోరు పంచాయతీ ఆస్తి కాదా, ప్రస్తుతం ఎవరు వినియోగిస్తున్నారు, వారికి అధికారిక అనుమతి ఉందా అనే విషయాలను అధికారులు పరిశీలించాలని వారు కోరారు. ప్రస్తుతం వర్షాలు సరిగా లేకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంచాయతీ బోరును తక్షణమే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవోను కోరారు. అలాగే బోరు చుట్టూ పెరిగిన చెట్లు, పొదలను తొలగించి ప్రదేశాన్ని శుభ్రం చేయించాలని, పంచాయతీ ఆస్తిని అనుమతి లేకుండా ఎవరైనా వినియోగిస్తున్నట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని యువకులు విజ్ఞప్తి చేశారు.

# పట్టాలు చేతిలో.. సామగ్రి భుజాన.. వాహనం కరువు !

## - పునరావాస పంపిణీ అనంతరం సుంకేసుల నిర్వాసితుల అవస్థలు



**మార్కాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాసంలో భాగంగా సుంకేసుల నిర్వాసితులకు మార్కాపురం కలెక్టరేట్‌లో ఇళ్ల పట్టాలు, రేషన్ కిట్లు, చీరలు, నిత్యావసర సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు. అయితే కార్యక్రమం అనంతరం వాటిని తీసుకుని ఇంటికి వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక నిర్వాసితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు సైతం సామగ్రిని చేతబట్టుకుని ఆటోల కోసం చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. కలెక్టరేట్ పట్టణానికి దూరంగా ఉండటంతో ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చిందని, కొందరు అధిక చార్జీలు డిమాండ్ చేశారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస సామగ్రి పంపిణీతో పాటు నిర్వాసితుల రవాణా ఇబ్బందులను కూడా అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని వారు కోరారు.ఇకపై ఇలాంటి కార్యక్రమాల సమయంలో పునరావాస కాలనీలు, గ్రామాలకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

**రాచర్ల, సెప్టెంబరు 7, ప్రభాతవార్త**

ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్లకు అర్హులైన వారు ఈనెల 7వ తేదీ నుండి 16వ తేదీ లోపు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలు తెలిపారు. వృద్ధాప్య వితంతు ఒంటరి వికలాంగ చేనేత మత్స్యకార డప్పు సంప్రదాయ చెప్పులతయారీ, టాడిట్యాపర్లు, ట్రాన్స్ జెండర్స్ తోపాటు, హెచ్ఐవి డయాలసిస్ వ్యాధిగ్రస్తులు ఇలా అర్హత ఉన్న ప్రతి ఒక్కరు సచివాలయాల్లో ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఏ కేటగిరికి సంబంధించిన వారు ఆ కేటగిరికి సంబంధించిన పూర్తి ధృవపత్రాలు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేసి దరఖాస్తు చేయించుకోవాలని అన్నారు.

ong-9_ong-9.qxd 9/7/2026 11:17 PM Page 1



# దొనకొండలో పరిశ్రమల ఏర్పాటుకు భూమిని సేకరించాలి

**ఒంగోలు, ప్రభాతవార్త**

సోమవారం అమరావతి నుండి పరిశ్రమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యువరాజ జిల్లా కలెక్టర్లతో పరిశ్రమల స్థాపనకై అవసరమైన భూసేకరణ గురించి వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు క్యాంపు కార్యాలయం నుండి పాల్గొని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కంపెనీవారు దొనకొండలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు సంబంధించి 2500 ఎకరాల భూమిని కోరి ఉన్నారని దానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన నగదును డిపాజిట్ చేయవలసిందిగా సంబంధిత యాజమాన్యానికి సూచించడం జరిగిందని వివరించారు. అందులో భాగంగా 86 కోట్ల రూపాయలను చెల్లించవలసి ఉందని యాజమాన్యానికి తెలియజేసినట్లు ఆయన తెలిపారు. సదరు భూమిని భారత డైనమిక్స్ లిమిటెడ్ నుండి డిఫెన్స్



రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ కు అందజేయాలని సూచించి ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్ ఎం ఏపీఐఐసీ మదనమోహన్ ఇతరులు పాల్గొన్నారు.

## బెల్టు నిర్వాహకులపై కేసు నమోదు

**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వారి ఆదేశాల మేరకు దర్శి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వారు 01.09.2026 నుండి 07.09.2026 వరకు దర్శి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్ సబ్బందితో కలిపి జరిపిన దాడులలో 8 మంది బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి 11.7 లీటర్ల మద్యం, 3.25 లీటర్ల బీరును సీజ్ చేయడం జరిగినది. ఎవరైనా మద్యం దుకాణాదారులు అనధికార మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేసినా లేదా వారికి సహకరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని దర్శి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో ప్రొహిబిషన్ తెలియజేశారు.

# మీ కోసం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 3 అర్జీలు

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి అధికారులు మూకుమ్మడిగా హాజరు**

**సంతనూతలపాడు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

సంతనూతలపాడు గ్రామ 1వ సచివాలయంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలు మేరకు సోమవారం నాడు ప్రవేశపెట్టిన మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి మూడు అర్జీలు వచ్చాయి. ఒకటి సర్వే కొలతలు, రెండు ల్యాండ్ రికార్డుల సమస్యలపై ఈ అర్జీలను రైతులు దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాల మేరకు మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సోమవారం నాడు నూతనంగా ప్రవేశపెట్టినట్టు సంతనూతలపాడు తాహసిల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఎంపీడీవో డి.సురేష్‌బాబులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి సోమవారం మండలంలో ఒక సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు తదుపరి మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమాలు జరిగే సచివాలయాలను ముందస్తుగా ప్రకటిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా తదుపరి మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని తాహసిల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబులు ఈ సందర్భంగా ఆదేశించారు. కాగా గతంలో కన్నా కొత్తగా జిల్లా కలెక్టర్ రాజాబాబు ప్రవేశపెట్టిన మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ముమ్మరంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు పర్యవేక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, వెలుగు మండల ఏపిఎం టి.బాబురావు, ఎంఈఓ డి.వెంకారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు అరుణ కుమారి, ప్రసూన, మండల ట్రాన్స్కో అసిస్టెంట్ ఇంజనీర్ పి.గోపి, మండల



ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ బి. మధుసూదన్ రావు, మండల పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వీరాంజనేయులు, మండల హౌసింగ్ ఏఈ మణీ ప్రసాద్, మండల పశు వైద్యాధికారిని డాక్టర్ అనురాధ, డ్వామా మండల ఏపీవో వాసంతి ఎన్.ఎస్.పి అసిస్టెంట్ ఇంజనీర్ రమణారెడ్డి, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెలుగొండయ్య, వీఆర్వో వెంకటస్వామి, మండల తెలుగుయువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టిఎన్టియుసి పావులూరి నారాయణ స్వామిచౌదరి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, టిడిపి నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, ఏ.మాధవ్, వైద్యారోగ్యశాఖ, వ్యవసాయ శాఖ తదితర శాఖల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో దారపనేని అండ్ బ్రదర్స్

**పామూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో ప్రసిద్ధి చెందిన కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సోదరులు తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ దారపనేని జనార్ధన్ రావు దంపతులు, దారపనేని కృష్ణ, దారపనేని వారి మేనల్లుడు తిరివీధి చంద్రమోహన్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అనునిత్యం దర్శనా నిమిత్తం వచ్చే భక్తులకు అందుబాటులో ఉంటూ భక్తులు స్వామివారి కృపకు పాత్రులవుతున్నారని పేర్కొన్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు రవి స్వామి వారి పట్టు వస్త్రంతో దారపనేని సోదరులను ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ధనెంకుల యోగేంద్ర, పెద్దన్న, నరసింహారావు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.



## కమ్యూనిస్టు నాయకుల కృషికి ఫలితం దక్కింది

**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కే.నారాయణతో కలిసి వెలిగొండను సందర్శించిన పామూరు సిపిఐ నాయకులు**

**పామూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**





దశాబ్దాల కమ్యూనిస్టు నాయకుల కృషి ఫలితంగా నేడు వెలుగొండ జలాలకు మోక్షం లభించిందని పామూరు సీనియర్ సిపిఐ నాయకులు సయ్యద్ మోలాలి మార్కాపురం జిల్లా నూతన సిపిఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ పామూరు మండల కార్యదర్శి పాలపర్తి మస్తానావు వజ్రాల సుబ్బారావు ఆకులు మోహన్ రావు సహాయ కార్యదర్శి రాగిపాటి సూరిబాబు కిషన్ సింగ్ తదితరులు అన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు కే నారాయణ జాతీయ రాష్ట్ర నాయకులు ఉప్పల నాగేశ్వరరావు మాజీఎమ్మెల్సీ చంద్రశేఖర్ నియోజవర్గ నాయకులు కలిసి సోమవారం నాడు వెలుగొండ ప్రాజెక్టు సందర్శించారు. ఐదు దశాబ్దాల క్రితం సిపిఐ నాయకులు చేసిన పోరాటంలో తాము పాల్గొన్న కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు భావితరాల యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకొని కమ్యూనిస్టు నాయకులు ముందస్తు ప్రణాళికలతో ప్రజలను చైతన్య చేసి పాలకుల కళ్ళు తెరిపించి దశాబ్దాల కల నెరవేర్చిన ఉద్యమకారులను ఈ సందర్భంగా వారు మననం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందు ఆలోచనతో తెలుగులో జరాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందే విధంగా కాలువలు దాని అనుసంధానంగా చేపట్టవలసిన పనులను త్వరితగతిన చేపట్టాలనీతద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు వేలాది గ్రామాలకు తాగునీరు అందుతుందనివారు సిపిఐ కోరారు.

## నిలిచిన సాగర్ నీటి సరఫరా తాగునీటి ఇక్కట్లు

**- కొనకనమిట్ల ఎస్సి కాలనీ వాసులకు తప్పని తిప్పలు**

**కొనకనమిట్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండల కేంద్రం కొనకనమిట్ల ఎస్సీ కాలనీలలో మూడు నెలల నుంచి సాగర్ నీటి సరఫరా నిలిచిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు దగ్గర దెబ్బ తిన్న పైప్ లైన్ కు మరమ్మత్తులు చేయకపోవడంతో రెండు నెలలు దాటుతున్న ఇప్పటికీ కాలనీలకు సాగర్ నీటి సరఫరా జరగటం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. నీటి సరఫరాలేకపోవడంతో బబుల్స్ నీరు డబ్బులు హెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నామని చెబుతున్నారు. బ్యాంకు దగ్గర దెబ్బతిన్న పైప్ లైన్ కు మరమ్మత్తులు చేపట్టేందుకు టీ దుకాణాన్ని తొలగించాల్సి ఉంది. ఎస్సీ కాలనీలకునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పగిలిపోయిన కుళాయిల దగ్గర కొత్తగా ఏర్పాటు చేశారు. ఇప్పటికీ నీటి సరఫరా చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగర్ నీటిని యధాతథంగా సరఫరా చేయాలని కోరుచున్నారు.

## కమ్యూనిస్టు నాయకులు కల నెరవేరిన వేళ

**- సిపిఐ నాయకుల పోరాటం త్యాగాల ఫలితమే వెలుగొండ ప్రాజెక్టు సాధన**

**పామూరు, సెప్టెంబర్7, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లా సిపిఐ నాయకుల పోరాట కృషి ఫలితమే నేడు వెలిగొండ ప్రాజెక్టు రూపకల్పన జరిగి శంకుస్థాపన దగ్గర నుండి ప్రాజెక్టు నుండి నీటి విడుదల వరకు దివంగత నేతల కృషిని నేడు స్లాగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది 50 సంవత్సరాల క్రితమే ఈ ప్రాంత కరువు పరిస్థితిని గమనించిన అప్పటి సీపీ నాయకులు మాజీ పార్లమెంటరీ సభ్యులు గుజ్జుల ఎలమంద రెడ్డి పార్లమెంట్లో గలమెత్తారు పార్లమెంట్ సభ్యుడిగా శాసనసభ్యుడిగా అనేకమందిని కూడగట్టి దీన్నే ఉద్యమాలకు రూపకల్పన చేసిన ఎలమందరెడ్డి బాటలోనే అప్పటి మార్కాపురం శాసనసభ్యులు పూల సుబ్బయ్య ఆ ఉద్యమానికి ఊపిరిపోశారు ప్రజల సమస్యలపై ప్రతినిత్యం పోరాటాలు చేసే కమ్యూనిస్టు శాసనసభ్యులు స్థానికముకు కాశిరెడ్డి కోటపాటిగురుస్వామి రెడ్డి అనునిత్యం ప్రజలతో మనమేకమే ఉండి వారి శ్రేయస్సే ధ్యేయంగా కృషి చేసిన తుపాకుల బసవయ్య గిద్దలూరు నియోజక వర్గంలో పేరు ప్రఖ్యాతులుగాంచిన సిపిఐ నాయకులుగా ప్రజల్లో వెలుగొండ పై అది పూర్తి అయితే భావితరాలకు కలిగే ప్రయోజనాలపై చైతన్యవంతంగా ఉంచేవారు. 1978 నుండి వెలుగొండ సాధన పోరాట సాధనలో ఎన్నో ఉద్యమాలు




నడిపిన యోధులుగా చరిత్రలో వీరు చేస్తాయిగా నిలిచిపోతారు అనంతరం ఎన్నో ప్రభుత్వాలు రావడం వెలిగొండ పై నీటి మీద రాతలు రాయటం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం పరిపాటిగా మారింది 1996లో అప్పుడు తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు శిలాఫలకం వేసి మామ అనిపించుకున్నారు అనంతరం కొందరు నాయకులు ఈ ప్రాజెక్టుపై మమకారం చూపినప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దృశ్య వెనకడుగు వేశారు కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వెలిగొండ పై మొసలి కన్నీళ్లు కార్చాయి మేము వస్తే అధికారులు చేపడతామంటూ మేము వస్తే అది అధికారంలో పూర్తి చేస్తామని ప్రగల్ పాల్పలికి అనంతరం ఈ ప్రాంత ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని 30 సంవత్సరాల తర్వాత శంకుస్థాపన చేసిన చేతులతోనే ప్రారంభోత్సవం నిర్వహించడం జరిగింది సిపిఐ నాయకులు చేసిన పోరాటాలను ఉద్యమాలను దృష్టిలో ఉంచుకొని మార్కాపురం శాసనసభ్యులుగా ఈ ప్రాంతానికి సూపరిచితులుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణమే తన ధ్యేయంగా కృషి చేసిన కామ్రేడ్ పూల సుబ్బయ్య పేరును ప్రాజెక్టులు నామకరణ చేయటం పట్ల సిపిఐ నాయకుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తం అవుతున్నాయి.

## పోతవరంలో పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని పోతవరం గ్రామపంచాయతీలో పిజిఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 7 అర్జీలు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించి 4, పెన్షన్ కోసం 3 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి డీఏఓ ఎస్ శ్రీనివాసరావు, దర్శి మండల ఎంపీడీవో పి.కల్పన, డిప్యూటీ ఎంపీడీవో ఆవుల సుధాకర్ రావు, అగ్రికల్చర్ రాధా, వెటర్నరీ డాక్టర్ బసవయ్య, హౌసింగ్, ఎలక్ట్రికల్ జేఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను తీసుకోవడం జరిగింది.



## వాసవి క్లబ్స్ గురువర్యులు వేమూరి, గ్రంధిలకు ఘన సత్కారం

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

వాసవీ క్లబ్ వ్యవస్థాపకులు ప్రముఖ స్వాతంత్ర్యసమర యోధులు కీర్తిశేషులు కల్వకుంట్ల చంద్ర సేన గుప్త జయంతి వారోత్సవాల్లో భాగంగా వాసవీ క్లబ్ మహిళా క్లబ్ సంతనూతలపాడు వారి ఆధ్వర్యంలో 7 వ రోజు అనగా సోమవారం నాడు చివరి రోజున గత 17 సంవత్సరాల నుండి వాసవీ ఉద్యమంలో పాల్గొంటూ సంతనూతలపాడు వాసవీ క్లబ్బులకు ఎవరు పదవులలో ఉన్నా తమ విలువైన సూచనలు సలహాలతో ముందుకు నడిపిస్తూ క్లబ్బుల అభ్యున్నతికి పాటుపడుతున్న వాసవి క్లబ్స్ గురుతుల్యులైన జిల్లా కో ఆర్డినేటర్ లు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, గ్రంది లక్ష్మీప్రసాదరావులను సోమవారం నాడు సంతనూతలపాడు లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య సంఘం సహాయ కార్యదర్శి గ్రంధి శరత్ బాబు, వాసవీ క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు వేమూరి శేషారావు, కోశాధికారి పామిడి సుధాకర్, జిల్లా ఆర్య వైశ్య సంఘం సహాయ కార్యదర్శి గ్రంధి శరత్ బాబు, మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, గౌరవ అధ్యక్షురాలు గ్రంధి సులోచన, సెక్రటరీ యస్. జయశ్రీ వాసవి క్లబ్, మాజీ అధ్యక్షులు, శిఘకొల్లి మల్లిఖార్జున రావు వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు, శిఘకొల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వాసవి క్లబ్స్ అద్భుత కు వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు చేస్తున్న కృషిని జిల్లా ఆర్యవైశ్య సంఘం సహాయ కార్యదర్శి శరత్‌బాబు ఈ సందర్భంగా కొనియాడారు.



## మద్దిపాడు మండలంలో మీ కోసం పీజీఆర్ఎస్‌కు 12 అర్జీలు

**సంతనూతలపాడు(మద్దిపాడు), సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మద్దిపాడు గ్రామ సచివాలయంలో సోమవారం నాడు జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలు మేరకు నూతనంగా ప్రవేశపెట్టిన మీకోసం పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమానికి వివిధ వర్గాల నుండి 12 అర్జీలు వచ్చాయి. రెవిన్యూకి సంబంధించి ఐదు, పంచాయతీరాజ్ కు సంబంధించి 7 అర్జీలు వచ్చాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాల మేరకు మండలంలో ఒక సచివాలయంలో మీకోసం పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం జరగనున్నట్టు ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.వరలక్ష్మీ, మద్దిపాడు ఎంపీడీవో డీ.ఎస్పీ ప్రసాద్‌లు ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి షేక్ నూరుల్లా, ఎంఈఓ ఆంజనేయులు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు రవిబాబు, ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ బాబు, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్న రాయుడు, మండల వ్యవసాయ అధికారిని స్వర్ణలత సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## రెండు రోజుల్లో రానున్న సాగర్ జలాలతో అన్ని చెరువులను నింపేందుకు ప్రత్యేక చర్యలు గైకొనాలి

**- ఎంపీడీవో సురేష్‌బాబు**

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

రెండు రోజుల్లో సంతనూతలపాడు మండలానికి రామతీర్థం జలాశయం నుండి నాగార్జునసాగర్ ఒంగోలు బ్రాంచ్ కెనాల్ కు సాగర్ నీరు విడుదల కానున్నట్టు సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. సంతనూతలపాడు ఒకటవ సచివాలయంలో సోమవారం జరిగిన తాగునీటి పరిరక్షణకు సంబంధించి ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా సాగర్ జలాలను మండలంలోని అన్ని చెరువులకు నీటిని నింపేందుకు ముఖ్యంగా గ్రామ పంచాయితీ అభివృద్ధి అధికారులు, వీఆర్వోలు, పోలీస్ శాఖ సిబ్బందితో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో. సురేష్ బాబు వెల్లడించారు. ఈ సమావేశంలో తాహసిల్దార్ ఎస్.ఎల్ నారాయణరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, వెలుగు ఎపిఎం. బాబురావు, ఎన్ఎస్పి డిస్ట్రిబూటర్ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు, ఎన్ఎస్పి అసిస్టెంట్ ఇంజనీర్ రమణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మీ కోసం పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక చర్యలు

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు సంతనూతలపాడు ఒకటవ సచివాలయంలో మీకోసం పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు సంబంధించి ఎంపీడీవో డి.సురేష్ బాబు, తాహసిల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డిలతో కూడిన పంచాయతీ బృందం వడ్డెరపాలెంలో సోమవారం సాయంత్రం ఫీల్డ్ విజిట్ చేసి సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. సంతనూతలపాడు వడ్డెర కాలనీలో డ్రింకింగ్ వాటర్, శానిటేషన్, స్ట్రీట్ లైట్స్, భూ సమస్యలపై ప్రజలతో నేరుగా ఎంపీడీవో సురేష్ బాబు, తాహ సిల్దార్ నారాయణరెడ్డి మాట్లాడారు.. పరిష్కార దిశగా చర్యలు తీసుకొనుటకు నిర్ణయాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్ శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది, వడ్డెర పాలెం కాలనీవాసులు పాల్గొన్నారు.



## లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌లో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన రెండు రోజుల "లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్"లో తొలిరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తో కలిసి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించి 'లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్' లో పాల్గొన్న దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీమతి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. టీడీపీ కేంద్ర కార్యాలయంలో లీడర్షిప్ కాంక్లేవ్‌లో పాల్గొని ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబు నాయుడు. కాంక్లేవ్‌లో పాల్గొన్న పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పొలిట్ బ్యూరో సభ్యులు, జోనల్ ఇంఛార్జ్‌లు.



## వినాయక చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

**- వినాయక మండపాల అనుమతులకు ఈపోర్టల్ - ఎస్సై కోటేశ్వరరావు**

**ముండ్లమూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని గ్రామాలలో వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహ కులకు ఆన్లైన్లో అనుమతులు మంజూరు చేసేందుకు సింగిల్ విండో ఈపోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.గణేష్‌ఉత్సవ్.నెట్ ను ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకొ చ్చింది. వివిధ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగ కుండా అనుమతులన్నీ ఈ పోర్టల్ ద్వారా సులువుగా పొందొచ్చు. ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు. ఈ వివరాలను ముండ్లమూరు ఎస్సై పి. కోటేశ్వరరావు తెలిపారు.



## పీఆర్ మోటర్స్ షోరూమ్‌ను ప్రారంభించిన డాక్టర్ కడియాల లలిత్ సాగర్

**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

దర్శి పట్టణం, పొదిలి రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పీఆర్ మోటార్స్ షోరూమ్‌ను ప్రారంభించిన టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈసందర్భంగా షోరూం యాజమాన్యం ఒగ్గు ప్రదీప్ వారి కుటుంబ సభ్యులు డాక్టర్ లలిత్ ని సత్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో దరిశి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి పట్టణ టిడిపి అధ్యక్షులు చిన్న, జనసేన నాయకులు కోట హనుమంతరావు, దర్శి రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ మునగ శ్రీను, మోలాలి బీఈడీ లా కాలేజీ డైరెక్ట్ షేక్ అల్లాబక్షు, కొల్లా చెంచయ్య, జమిలి శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## స్వచ్ఛమైన నీటిని అందించాలి

**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ఎన్ఏపి రిజర్వాయర్ దగ్గర ఉన్న ఫిల్టర్ బెడ్లను మార్చి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి అందించాలని సిపిఎం దర్శి నియోజకవర్గ నాయకులు తాండవ రంగారావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిపిఎం ప్రతినిధి బృందం సోమవారం దర్శి తాహసిల్దార్ కార్యాలయంలో డిటి దేవప్రసాద్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ 123 గ్రామాలకు పైగా మంచి నీటిని అందిస్తున్న నెదర్లాండ్ ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న ఈ స్కీము ఎన్ఏపి రిజర్వాయర్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లు గత 20 సంవత్సరాల నుంచి మార్చకపోవడంతో తాగునీటిలో పాచి, పురుగులు, అనేక మలినాలు వస్తున్నాయని ఈ నీరు ప్రజలకు తాగటానికి అనుకూలంగా లేకపోవడంతో ప్రైవేటు వాటర్ ఆర్.ఓ ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. దర్శిలో తాగటానికి మంచినీరు ఉంటుందని గ్యారెంటీ ఉండటంతోనే అనేకమంది ఉద్యోగులు ఇక్కడ స్థిరపడ్డారని, కానీ ఈరోజు ఉద్యోగులకు, ప్రజలకు అటువంటి గ్యారెంటీ లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, శాఖ కార్యదర్శిలు కేవీ పిచ్చయ్య ఉప్పు నారాయణ తదితరులు పాల్గొన్నారు



## బీజేపీ మండల పదాధికారుల సమావేశం

**ముండ్లమూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలంలో బసాపురం భారతీయ జనతా పార్టీ మండల పదాధికారుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముండ్లమూరు మండల అధ్యక్షుడు మండలపు వెంకట శేషయ్య అధ్యక్షతన ముఖ్య అతిథిగా రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ మాదపాకుల శ్రీనివాసులు పాల్గొని ముండ్లమూరు పదాధికారులతో ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోవు స్థానిక బాడీ ఎలక్షన్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని కూటమి తరుపున స్థానిక బాడీ ఎలక్షన్లో పోటీ చేయుఆశావాహులు పేర్లు జిల్లా పార్టీకి ఇవ్వవలసినదిగా కోరడమైనది ఈ కార్యక్రమంలో భాగంగా కిలారి రమణమ్మ నిడమనూరి రవి అంజిరెడ్డి అంజమ్మ వెంకటేశ్వర్లు భారతీయ జనతా పార్టీ స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జైలు శిక్ష, జరిమాన

**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

దర్శి పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నలుగురు వ్యక్తులకు దర్శి జేఎస్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఒక్కొక్కరికి 15రోజులు జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమాన విధించారు. వీరిని దర్శి సబ్ జైలుకు పంపించడం జరిగిందని ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

## మహిళలకు ఉచితంగా బ్యూటిషయన్ కోర్స్‌పై శిక్షణ

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండల పరిధిలోని ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లాస్థాయి మహిళా ప్రాంగణంలో మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వబడనున్నట్టు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ కె.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి కలిగిన 15-40 సంవత్సరాల వయసుగల నిరుద్యోగ మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం మొబైల్ నెంబర్లు 6302733492, 9963005209, 9000850869 సంప్రదించగలరనని జిల్లా మేనేజర్ మాధవి కోరారు.